ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 19.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 269 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

అసలు 'గిల్'కు ఏమైంది..? 8

పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ప్రభంజనం సృష్టించిందని సీఎం రేవంత్‌అన్నారు. ప్రజా పాలనకు రాష్ట్ర ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారన్న సీఎం.. 2029 లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని అన్నారు. పంచాయితీ ఫలితాలు మాపై మరింత బాధ్యతను పెంచాయని, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర బీజేపీ చేస్తోందని సీఎం ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాల పంపకాల్లో తెలంగాణకు ఎవరు అన్యాయం చేశారో చర్చిద్దామని, చర్చకు రావాలంటూ బీఆర్ఎస్‌కు సవాలు విసిరారు.

ప్రజాపాలనకు ప్రజల సంపూర్ణ మద్దతు

- స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలు జరిపించాం
- 2029 లోనూ ఇవే ఫలితాలు పునరావృతం
- అసెంబ్లీలో చర్చించాకే ఎంపీటీసీ, మున్సిపల్‌ఎన్నికలు
- నీటి పంపకాల్లో తెలంగాణకు అన్యాయం చేసింది కేసీఆరే
- గోదావరి, కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చిద్దామని సవాల్
- 'ఉపాధి' పథకం నిర్వీర్యానికి బీజేపీ కుట్ర
- విలేఖరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ప్రభంజనం

ఫలితాలు మరింత బాధ్యతను పెంచాయి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్18: రాష్ట్రంలో ప్రజాపాలనకు సంపూర్ణ మద్దతు లభించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్‌పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అనుకూలమని ముఖ్యమంత్రి అన్నారు. మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత ఫలితాలు సాధించిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపునకు కష్టపడిన పార్టీ కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. ఎన్నికలను విజయవంతంగా

...:: మిగతా 2లో

రాజకీయంగా కక్ష సాధిస్తున్నారు

ఢిల్లీ హైకోర్టు తీర్పు మోదీకి చెంపపెట్టు

టీపీసీసీ చీఫ్‌మహేశ్‌కుమార్ ధ్వజం

- ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తాం
- ఎప్పటికైనా సత్యమే గెలుస్తుంది
- నేషనల్ హెరాల్డ్ కేసులో అదే జరిగింది
- రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్
- బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- గాంధీభవన్ వద్ద ఉద్రిక్తత

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్18: నేషనల్ హెరాల్డ్ కేసులో గాంధీ కుటుంబాన్ని వేధిస్తున్నారని టీపీసీసీ చీఫ్‌మహేశ్ కుమార్ విమర్శించారు. సోనియా, రాహుల్‌గాంధీపై రాజకీయంగా కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. సోనియా గాంధీ వయస్సు చూడకుండా ఇబ్బందులు పెడుతున్నారని, ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు మోదీకి చెంపపెట్టు లాంటిదని, ఇప్పటికైనా ప్రధాని మోడీ తన తప్పు తెలుసుకుని గాంధీ కుటుంబానికి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. నేషనల్ హెరాల్డ్

...:: మిగతా 2లో

ఫోన్ ట్యాపింగ్ కేసు..

సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో మరో సిట్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్18: తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారులతో మరో సిట్ ఏర్పాటు అయ్యింది. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సిట్‌లో రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సిద్దిపేట కమిషనర్ ఎస్ఎం విజయ్ కుమార్, మహేశ్వరం డీసీపీ నారాయణ్‌రెడ్డి, మాదాపూర్ డీసీపీ రితురాజ్, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ రవీందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కేఎస్ రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ శ్రీధర్, హైదరాబాద్ మెట్రోలో పనిచేస్తున్న నాగేందర్ సభ్యులుగా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఫోన్ కాల్స్ రికార్డ్ చేశారనే ఆరోపణలపై ఇప్పటికే ప్రాథమిక విచారణ జరిగింది. ఇప్పుడు ఉన్నత స్థాయి అధికారులతో కూడిన ఈ సిట్ ద్వారా కేసును ఒక కొలిక్కి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. రాజకీయ వేధింపులు, గోప్యత ఉల్లంఘన వంటి అంశాల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

'ఉపాధి' బిల్లుకు లోక్ సభ ఆమోదం

ఉద్రిక్తల నడుమ వీబీజీ రామ్‌జీ బిల్లు పాస్.. తీవ్రస్థాయిలో విపక్ష సభ్యుల నిరసన

- స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లిన సభ్యులు
- శుక్రవారానికి లోక్‌సభ వాయిదా
- గాంధీజీ ఆశయాలను గౌరవిస్తాం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్
- పేర్ల మార్పుపైనే ఎక్కువ దృష్టి
- కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్18: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) 2025' వీబీజీ రామ్‌జీ బిల్లు గురువారం లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో సభలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. దశాబ్దాలుగా అమల్లో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

...:: మిగతా 2లో

గంగకత్వ కాలువ ఆధునీకరణకు ప్రతిపాదనలు

- రూ.101 కోట్లతో కాలువ, చెరువులు, చెక్‌డ్యాంల అభివృద్ధి
- నీటిపారుదల శాఖ అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

...:: 3లో

రాజ్యాంగాన్ని స్పీకర్ ఆపహాస్యం చేశారు

- పార్టీ మారితే రాజీనామా నైతికత
- కొత్తగూడెం జిల్లాలో కవిత 'జనం బాట'
- ప్రభుత్వ వైఫల్యాలపై కవిత ఆగ్రహం
- సింగరేణి సమస్యలపై తీవ్ర అసహనం

...:: 3లో

తెలంగాణ గ్రూప్- 3 ఫలితాలు వెల్లడి

- ప్రొవిజనల్ ఎంపిక జాబితా విడుదల
- 1,388 పోస్టులకు గాను 1,370 మంది అభ్యర్థుల ఎంపిక
- కోర్టు తీర్పునకు లోబడి జాబితా: టీజీపీఎస్సీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్18: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుభవార్త చెప్పింది. గ్రూప్3 సర్వీసులకు సంబంధించి ప్రొవిజనల్ ఎంపిక జాబితాను గురువారం విడుదల చేసింది. మొత్తం 1,388 పోస్టులకు గాను 1,370 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ప్రకటించింది. 2022లో 1388 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ గ్రూప్3 నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పోస్టులకు రాతపరీక్షలు నిర్వహించారు. అయితే గ్రూప్1, 2 వివాదాలు, పలు కోర్టు కేసుల కారణంగా ఫలితాల వెల్లడిలో జాప్యం జరిగింది. తాజాగా, ఈ ఏడాది మార్చి

...:: మిగతా 2లో

మోడీకి ఓమన్ అత్యున్నత పురస్కారం

భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు.

7

'శాంతి' బిల్లుకు ఉభయసభల ఆమోదం

సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) బిల్లును మూజువాణి ఓటుతో రాజ్యసభ గురువారం ఆమోదించింది.

7

కర్ణాటకలో చైనా స్పై బర్డ్ కలకలం!

చైనా జీపీఎస్ ట్రాకర్ అమర్చిన సీగల్ అనే సముద్రపు పక్షి కర్ణాటక తీరంలో కనిపించడం కలకలానికి దారి తీసింది. ఉత్తర కన్నడ జిల్లాలోని రవీంద్రనాథ్ ఠాగూర్ బీచ్ వద్ద కోస్టల్ మెరీన్ పోలీస్ సెల్ బృందం ఈ పక్షిని గుర్తించింది.

7

సిడ్నీలో ఉగ్రదాడికి ప్లాన్

సిడ్నీ శివారు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో.. ఓ కారును సీజ్ చేశారు. దాంట్లో ప్రయాణిస్తున్న ఏడు మందిని అదుపులోకి తీసుకున్నారు. న్యూ సౌత్ వేల్స్ పోలీసులు దీనిపై ప్రకటన జారీ చేశారు. ఓ విధ్వంసకర దాడికి ప్లాన్ జరిగినట్లు తెలుస్తోందన్నారు.

7

రాష్ట్రీయం

సీఎంను కలిసిన ఆటా ప్రతినిధులు

- 19వ మహాసభలకు ఆహ్వానం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్18: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) ప్రెసిడెంట్ జయంత్ చల్లా, ఎలెక్ట్ ప్రెసిడెంట్ సతీష్ రామసహాయం రెడ్డి, ఇతర ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే ఏడాది జూలై 31న జరగనున్న 19వ ఆటా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎంతో అమెరికాలో ఉన్న తెలుగు ప్రవాసుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఆటా మహాసభలకు రావాలని కోరారు. అలాగే 19వ మహాసభల లక్ష్యాలు, కార్యక్రమాల రూపురేఖలను ముఖ్యమంత్రికి వివరించారు. యువత భాగస్వామ్యం, వ్యాపార అవకాశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణలుగా ఉంటాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆటా ప్రతినిధులతో మాట్లాడుతూ, తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఆటా కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ప్రవాస భారతీయులు, ముఖ్యంగా తెలుగు వాసులు రాష్ట్ర అభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. విద్య, ఐటీ, పెట్టుబడులు, సాంస్కృతిక మార్పిడిలో ఆటా వేదికగా నిలుస్తోందని అన్నారు. అలాగే ఈ మహాసభలు తెలుగు ఐక్యతను ప్రపంచస్థాయిలో చాటేలా నిర్వహించేందుకు తమ సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బోర్డ్ ఆఫ్ ట్రస్టీ, కోచైర్ నరసింహ ద్యాసాని, సాయి సుధిని, ట్రెజరర్ శ్రీకాంత్ గుడిపాటి, ఇతర ప్రతినిధులు శ్రీధర్ బాణాల, కాశీ కొత్త, రామకృష్ణ అలా, సుధీర్ దామిడి, శ్రీధర్ తిరిపతి, పరమేష్ భీంరెడ్డి, రాజు కక్కెర్ల, రఘువీర్ మర్రిపెద్ది, వినోద్ కోడూరు, కిషోర్ గూడూరు, నర్సిరెడ్డి గడ్డికోపుల, విష్ణు మాధవరం, హరీష్ బత్తిని, సుమ ముప్పాల, వేణు నక్షత్రం, లక్ష్ చేపూరి, అనంత్ పజ్జూర్, అరవింద్ ముప్పిడి, తిరుమల్ మునుకుంట్ల, మీడియా సలహాదారు ఈశ్వర్ బండా తదితరులు వున్నారు.

ప్రజాపాలనకు ప్రజల సంపూర్ణ మద్దతు

మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, రాజనర్సింహ తదితరులలో కలిసి సీఎం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 12,702 పంచాయతీలకు గానూ 7,527 పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని సీఎం అన్నారు. 808 కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారని వివరించారు. 8,335 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్, కాంగ్రెస్ రెబల్స్ గెలుచుకున్నారని వివరించారు. దీంతో 66 శాతం ఫలితాలను కాంగ్రెస్ పార్టీ సాధించిందన్నారు. 3,511 బీఆర్ఎస్, 710 బీజేపీ మొత్తంగా 33 శాతం గెలిచాయని పేర్కొన్నారు.

రెండేళ్ల పాలనకు ప్రజలిచ్చిన తీర్పు

మా రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ ఫలితాలని ముఖ్యమంత్రి అభివర్ణించారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారని గుర్తుచేశారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరగ్గా.. 87 నియోజకరవర్గాల్లో కాంగ్రెస్ మెజారిటీ సాధించిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ 6 నియోజవర్గాల్లో, బీజేపీ 1 నియోజకవర్గంలో అత్యధిక ఫలితాలు సాధించాయని అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం కనబరిచారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా పోటీ చేశాయని ఆరోపించారు. ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజలకు స్వేచ్ఛను అందించామన్నారు. స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో ఎన్నికలు జరిపించామన్నారు. హోదాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను ప్రభావితం చేసేలా మేం నిర్ణయం తీసుకోలేదని సీఎం తెలిపారు. పంచాయితీ ఫలితాలు మాపై మరింత బాధ్యతను పెంచాయని సీఎం అన్నారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర బీజేపీ చేస్తోందని సీఎం ఆరోపించారు.

కేటీఆర్, హరీశ్ తీరుపై...

ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా కొందరికి ఇంకా అహంకారం తగ్గలేదంటూ బీఆర్ఎస్ నేతల తీరుపై సీఎం మండిపడ్డారు. ఒకాయన కడుపులో మూసీలో కాలుష్యం కంటే ఎక్కువ విషం కనిపిస్తోందని ధ్వజమెత్తారు. ఈ ఫలితాలు చూసే అద్భుతం అని కొందరు జబ్బలు చరుచుకుంటున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. 2029 లో కూడా ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని సీఎం అన్నారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని చెప్పుకొచ్చారు. కోపం, అసూయతో ప్రజలకు మంచి జరగకుండా అడ్డుకోవద్దని బీఆర్ఎస్ నేతలకు సీఎం హితవు పలికారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో ఉండగానే ఆయన్ను ఓడించి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చామని సీఎం తెలిపారు. ఇప్పుడు ఆయన క్రియాశీల రాజకీయాల్లో లేరని, గజ్వేల్ నియోజకవర్గంలో మెజార్టీ పంచాయితీలు కాంగ్రెస్‌ఖాతాలో ప్రజలు వేశారని తెలిపారు. ''కేసీఆర్ కు సూటిగా సవాల్ విసురుతున్నా.. ప్రతిపక్ష నాయకుడిగా లేఖ రాయమనండి.. కృష్ణా, గోదావరి జలాలపై ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం'' అంటూ సీఎం తెలిపారు. ఎప్పుడంటే అప్పుడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని, రుజువులతో చర్చిందామంటూ సీఎం పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్లలో తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేసింది బీఆర్ఎస్, కేసీఆర్ అంటూ ఆరోపించారు.

అసెంబ్లీలో చర్చించిన తర్వాతే..

42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రజాస్వామ్య బద్ధంగా అసెంబ్లీలో చర్చ చేసిన తర్వాతనే ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం తీసుకోనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలవలేదన్నారు. కేటీఆర్ ను తప్పించాలని హరీశ్ వర్గం సోషల్ మీడియాలో ప్రచారం మొదలు పెట్టిందన్నారు. అందుకే ఆ విషయం చర్చకు రాకుండా కేటీఆర్ జిల్లాల పర్యటనలు మొదలు పెట్టారంటూ ఎద్దేవా చేశారు.

బెళగావి రైలులో మంటలు

- శంకర్‌పల్లిలో ఘటన

ప్రతిపక్షం, రంగారెడ్డి, డిసెంబర్18: హైదరాబాద్ నుంచి బెళగావి వెళ్తున్న స్పెషల్ రైలు బోగీల కింద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలను గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే రైలును నిలిపివేసి.. మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఒక్కసారిగా ఉన్నట్టుండి రైలులో మంటలు రావడంతో ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. బ్రేక్ జామ్ అవడం వల్లే మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చిన తర్వాత రైలు తిరిగి బెళగావికి బయలుదేరి వెళ్లింది. ఈ ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

తెలంగాణ గ్రూప్- 3 ఫలితాలు వెల్లడి

మొదటిపేజీ తరువాయి

14న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (GRL) ఆధారంగా ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు కమిషన్ తెలిపింది. ఎంపికైన వారి హాల్ టికెట్ నంబర్లను అధికారిక వెబ్‌సైట్ https://www.tgpsc.gov.in లో అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు తమ వివరాలను చూసుకోవచ్చని టీజీపీఎస్సీ సూచించింది. ప్రస్తుతం విడుదల చేసిన ఈ జాబితా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ల తుది తీర్పునకు లోబడి ఉంటుందని కమిషన్ స్పష్టం చేసింది. అభ్యర్థులు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే, వారి ఎంపికను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం కమిషన్‌కు ఉంటుందని టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ ప్రియాంక ఆలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాజకీయంగా కక్ష సాధిస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌ను ఈడీ కేసులతో వేధిస్తున్నారని, దీనికి ఏఐసీసీ దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునివ్వడంతో తెలంగాణ రాష్ట్రంలో పార్టీ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. హైదరాబాద్‌లోని గాంధీ భవన్ నుంచి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు యత్నించాయి. గాంధీ భవన్ గేట్లు పోలీసులు మూసేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో గాంధీ భవన్ గేటు ఎదుట కాంగ్రెస్ నేతలు బైఠాయించారు. పలువురు నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనతో గాంధీభవన్ వద్ద భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. మరోవైపు కాంగ్రెస్ నేతల ర్యాలీతో బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ శ్రేణుల ముట్టడి యత్నంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బీజేపీ కార్యాలయానికి వెళ్లే మార్గంలో బారికేడ్లు పెట్టారు. కాంగ్రెస్ శ్రేణులు వస్తున్నాయనే సమాచారంతో బీజేపీ కార్యకర్తలు అప్రమత్తమయ్యారు. వారిని అడ్డుకునేందుకు భారీగా వచ్చాయి. బారికేడ్ల వైపు బీజేపీ కార్యకర్తలు కర్రలతో దూసుకెళ్లారు. దీంతో పలువురు నిరసనకారులను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తాం

ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని, నేషనల్ హెరాల్డ్ పేపర్ కేసు విషయంలో అదే జరిగిందని, రేపు కూడా అదే జరుగుతుందని రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌అన్నారు. బీజేపీ పెడుతున్న అక్రమ కేసుల గురించి ప్రజలకు వాస్తవాలు చెప్తామని, గాంధీ కుటుంబంపై బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. గాంధీ పేరుని సైతం తొలిగిస్తుందని, న్యాయం గెలవడానికి సమయం పట్టొచ్చని, కానీ చివరికి గెలిచేది న్యాయమేనని వెల్లడించారు. నేషనల్ హెరాల్డ్ పేపర్ గురించి బీజేపీకి ఏమి తెలియదని, తమ మార్గమే అహింస మార్గం, అలాగే శాంతియుతంగా నిరసన చేసి ప్రజలకు వాస్తవాలు తెలిచేస్తామని వివరించారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 18: సంక్షేమంతో పాటు దివ్యాంగులు స్వతంత్రంగా, గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గౌరవ సాంఘిక సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఆలియన్ ఇన్నోవేషన్‌కార్యాలయంలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల కోసం అసిస్టివ్ టెక్నాలజీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు కేవలం సహాయం పొందే వర్గం కాదని, అవకాశం ఇస్తే తమ కాళ్లపై తామే నిలబడి ఆత్మవిశ్వాసంతో జీవించగల సామర్థ్యం ఉన్న పౌరులని మంత్రి పేర్కొన్నారు. ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన దృక్పథమని తెలిపారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం పింఛన్లకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, ఉద్యోగ రిజర్వేషన్, టెక్నాలజీ, స్వయం ఉపాధి అన్నీ కలిసేలా సమగ్ర విధానంతో పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దివ్యాంగుల పింఛన్లు సకాలంలో, ఎలాంటి అడ్డంకులు లేకుండా పేద దివ్యాంగుడి చేతికి చేరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే చదువుతున్న దివ్యాంగ విద్యార్థి ఎక్కడా ఆగిపోకుండా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు ఉన్న రిజర్వేషన్ కాగితాల్లోనే కాకుండా వాస్తవంగా ఉద్యోగాల్లో కనిపించాలన్నదే సీఎం స్పష్టమైన ఆదేశమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీ సీఈఓ మిరాజ్, యునిసెఫ్ (ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ) ఫీల్డ్ ఆఫీసర్ జెలామియాలి, ఎల్వీ ప్రసాద్ ఐఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి ప్రదీప్‌తో పాటు నెట్ వర్క్ మోడల్‌పై పనిచేస్తున్న పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్ఫెక్షనే కాదు..సిన్సియారిటీ కూడా అవసరం

- పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్ గవర్నెన్స్'
- ప్రజాసేవలో అంతర్గత బలహీనతలే ప్రమాదకరం
- యువ సివిల్ సర్వెంట్లకు మంత్రి శ్రీధర్ బాబు దిశానిర్దేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 18: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు యువ సివిల్ సర్వెంట్లకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణలో గురువారం నిర్వహించిన 'స్పెషల్ ఫౌండేషన్ కోర్స్ ఫర్ ఏఐఎస్ & సీసీఎస్ ఆఫీసర్స్-2025' ముగింపు వేడుకలకు ఆయన విశిష్ఠ అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ దేశం మీ నుంచి కేవలం పర్ఫెక్షన్ మాత్రమే ఆశించడం లేదు, అంతకంటే ఎక్కువగా మీరు చేసే పనిలో సిన్సియారిటీని కూడా కోరుకుంటోంది అని యువ సివిల్ సర్వెంట్లకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గవర్నెన్స్ అంటే కేవలం ఫైళ్లు, నిబంధనలు కాదని, అది ప్రజలతో మమేకమయ్యే ఒక హ్యూమన్ రిలేషన్ అని అన్నారు. అధికారం, హోదా, ప్రోటోకాల్స్ అన్నీ తాత్కాలికమని, ప్రజల జీవితాల్లో మీరు తీసుకొచ్చే సానుకూల మార్పు మాత్రమే శాశ్వతమన్నారు. నిర్ణయాలు తీసుకునే సమయంలో సమాజంలోని చిట్టచివరి వ్యక్తిని, నిరుపేదల ప్రయోజనాలనూ పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అప్పుడే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయన్నారు. కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యం ప్రజలతో మమేకం కావాలని ఉద్బోధించారు. ప్రజా సేవలో బాహ్య ఒత్తిళ్ల కంటే అహంకారం, ఉదాసీనత, అవినీతి లాంటి అంతర్గత బలహీనతలే ప్రమాదకరమని హెచ్చరించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ స్వీయ నియంత్రణ పాటిస్తూనే, నిజాయితీ, వినమ్రత, ధైర్యం కోల్పోవద్దని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పౌర సేవలు ప్రజల ముంగిటకు చేరాలంటే టెక్నాలజీ వినియోగం అత్యవసరమన్నారు. అయితే ఆ సాంకేతికత ప్రజలకు చేరువగా ఉండాలి కానీ, వారిని భయపెట్టేలా ఉండొద్దన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్ గవర్నెన్స్' సాధ్యమవుతుందని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని యువ అధికారులకు సూచించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేదలు వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవలసి వస్తుంది. కోటి సంతకాలను గవర్నర్‌కు సమర్పించి చంద్రబాబు స్కామ్‌ను వివరించాం. స్కూళ్లు, ఆసుపత్రులను ప్రభుత్వం నడపకపోతే ఆ సేవలు పేదలకు భరించరానివి అవుతాయి. రూ.8 వేల కోట్లతో 17 కాలేజీలను భూములు సేకరించి కట్టాం. 7 కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. మీకు చేతకాకపోతే మేం వచ్చాక పూర్తిచేస్తాం.
- వైసీపీ అధినేత జగన్

గాంధీజీ పేరు తీసేస్తే చరిత్ర మారుతుందా?

- 'ఉపాధి' పథకం పేరు మార్పు గాంధీజీని అవమానించినట్లే
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్18: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీజీ పేరును తొలగించడం ఆయనను అవమానించినట్లేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన పేరును తొలగించడం సిగ్గుచేటని అన్నారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో 2005లో ఆనాటి యూపీఏ ప్రభుత్వం చారిత్రాత్మకమైన ఉపాధి హామీ పథకాన్ని తీసుకువస్తే గడచిన పది సంవత్సరాల నుంచి బీజేపీ ప్రభుత్వం ఆ పథకానికి తూట్లుపొడుస్తూ నీరుగారుస్తోందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, రాష్ట్రాలపై 40 శాతం భారాన్ని నెట్టడం పేదల పొట్ట కొట్టడమేనని దుయ్యబట్టారు. ఈ రోజు పార్లమెంట్‌లో తీసుకువచ్చిన బిల్లు అభివృద్ధి తిరోగమనమేనని, రాష్ట్రాలపై మోయలేని భారమని అన్నారు. దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' ఇప్పుడు 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్' గా మార్చడం అన్యాయమని అన్నారు. లోక్‌సభలో బలవంతంగా గురువారం ఆమోదించిన ఈ కొత్త బిల్లు, పథకం యొక్క స్వభావాన్ని, నిధుల సమీకరణను పూర్తిగా మార్చివేసిందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుడు, జాతిపిత మహాత్మా గాంధీ పేరు మీద 20 ఏళ్ల క్రితం యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పేరు మార్చడం వెనుక కేంద్ర పాలకుల సంకుచిత మనస్తత్వం కనిపిస్తోందని, పేరు మార్చినంత మాత్రాన వారి వైఫల్యాల నుంచి కప్పిపుచ్చుకోలేరని అన్నారు. వికసిత్ భారత్ అని నినాదాలు ఇస్తూ, గ్రామీణ భారతానికి వెన్నెముకగా ఉన్న పథకాన్ని అగాధంలోకి నెడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, పేదల కడుపు కొడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

'ఉపాధి' బిల్లుకు లోక్ సభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

(ఎంజీ నరేగా) స్థానంలో కేంద్రం ఈ 'వీబీజీ రామ్ జీ' బిల్లును తీసుకువచ్చింది. ప్రస్తుతమున్న 100 రోజుల ఉపాధి హామీని ఈ కొత్త బిల్లు ద్వారా 125 రోజులకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గతంలో కేంద్రం 90శాతం, రాష్ట్రాలు 10శాతం భరించే నిధుల వాటాను ఇప్పుడు 60:40 నిష్పత్తికి మార్చారు. అంటే రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారం పెరగనుంది. ఈ బిల్లును మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న విపక్ష సభ్యులు సభలో తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. కొందరు ప్రతిపక్ష సభ్యులు బిల్లు ప్రతిని చింపిగాలిలోకి విసిరేశారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చడం, నిబంధనల మార్పుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సభలో కొద్దిసేపు తీవ్ర గందరగోళం నెలకొంది. అంతకుముందు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో నిరసన మార్చ్ నిర్వహించారు. ఈ బిల్లు ఆమోదం తర్వాత లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది.

పేర్ల మార్పుపైనే ఎక్కువ దృష్టి: ప్రియాంకా గాంధీ

ఈ బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ మధ్య మాటల యుద్ధం నడిచింది. "ఈ ప్రభుత్వం పేర్ల మార్పుపైనే ఎక్కువ దృష్టి పెడుతోంది. మహాత్మా గాంధీ పేరును తొలగించడం అంటే ఆయన ఆశయాలను అవమానించడమే. ఈ కొత్త బిల్లు వల్ల రాష్ట్రాలపై భారం పడి పేదలకు ఉపాధి దూరమయ్యే ప్రమాదం ఉంది" అని ప్రియాంకా గాంధీ మండిపడ్డారు. "గాంధీజీ పేరును 2009 ఎన్నికల కోసం కాంగ్రెస్ వాడుకుంది. మేము గాంధీజీ ఆశయాలను గౌరవిస్తాము, అందుకే 100 రోజుల పనిని 125 రోజులకు పెంచాం" అని మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమాధానమిచ్చారు. అలాగే నెహ్రూగాంధీ కుటుంబం పేరుతో ఉన్న పథకాల జాబితాను ఆయన సభలో చదివి వినిపించారు.

గ్రామీణ జీవనోపాధిని పెంచడమే..

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చేందుకే ఈ వీబీజీ రామ్ జీ బిల్లును ప్రవేశపెట్టామని ప్రభుత్వం పేర్కొంది. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ జీవనోపాధిని పెంచడమే దీని ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడానికే ప్రభుత్వం ఈ కొత్త బిల్లును తీసుకువచ్చిందని, పేదల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని విపక్ష నేతలు ఆరోపించారు. సభలో చర్చకు అవకాశం ఇవ్వకుండానే బిల్లును పాస్ చేసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు.

రాజ్యాంగాన్ని స్పీకర్ ఆపహాస్యం చేశారు

- పార్టీ మారితే రాజీనామా నైతికత
- కొత్తగూడెం జిల్లాలో కవిత 'జనం బాట'
- ప్రభుత్వ వైఫల్యాలపై కవిత ఆగ్రహం
- సింగరేణి సమస్యలపై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ప్రతిపక్షం, కొత్తగూడెం/ ఇల్లందు / మణుగూరు, డిసెంబర్ 18: పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తీర్పు రాజ్యాంగాన్ని అపహాస్యం చేసినట్లుగా ఉందని కవిత విమర్శించారు. పార్టీ మారితే పదవికి రాజీనామా చేయాల్సిన నైతికత ఉండాలని అన్నారు. తాను బీఆర్ఎస్‌ను విడిచిన వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని, కానీ ఇప్పటికీ దానిపై చర్యలు లేవని గుర్తు చేశారు. తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగూడెం జిల్లాలో రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇల్లందు మండలం సత్యనారాయణపురంలోని హజ్రత్ నాగూల్ మీరా దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా అభివృద్ధి విషయంలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులు అనవసర ఇబ్బందులు పెడుతున్నారని కవిత ఆరోపించారు. ఉర్సు సందర్భంగా వేలాది భక్తులు వస్తున్నా కనీస సౌకర్యాలు కూడా లేవని అన్నారు. దర్గా వద్ద పర్మినెంట్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని, మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించాలని, మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని జిల్లాలోని ముగ్గురు మంత్రులను డిమాండ్ చేశారు. దర్గాతో పాటు రామాలయం ఉండటం హిందూ-ముస్లిం ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. తదుపరి కొత్తగూడెం ఎంజీ రోడ్డులోని మార్కెట్ ప్రాంతంలో తెలంగాణ జాగృతి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనం బాట ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్ హామీల అమలు లేదని విమర్శ

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను మరిచిపోయిందని, మహిళలకు రూ.2,500, పెన్షన్ల పెంపు, ఉచిత విద్యుత్ వంటి హామీలు అమలు కావడం లేదని ఆరోపించారు. భర్త చనిపోయిన మహిళలకు పదేళ్లుగా పెన్షన్ రాకుండా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని, కొత్త బొగ్గు బ్లాకులు కూడా కేటాయించట్లేదని కవిత గారు అన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సింగరేణి కార్మికుల కోసం జాగృతి నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కొత్తగూడెం ప్రభుత్వ సార్వజనీన ఆసుపత్రిని సందర్శించిన కవిత గారు, అక్కడ పడకలు, మందులు, వసతుల కొరత ఉన్నా డాక్టర్లు, సిబ్బంది సేవలందిస్తున్నారని ప్రశంసించారు. అయితే కొత్తగూడెం లాంటి ప్రాంతానికి కనీసం 750 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అవసరమని, కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ వంటి విభాగాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌లో పనిచేస్తున్న కేర్ టేకర్లు, శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత, హెల్త్ పాలసీ కల్పించాలని కోరారు.

కొత్తగూడెం అభివృద్ధికి కార్యాచరణ

మణుగూరులో మాట్లాడుతూ, కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని కవిత గారు తెలిపారు. పరిశ్రమలు మూతపడటం, స్థానికులకు ఉద్యోగాలు లేకపోవటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి తెలంగాణ జాగృతి అంకితభావంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు.

సీఎం రేవంత్‌తో ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా భేటీ

- రాష్ట్రంలో తీసుకొచ్చిన సంస్కరణలపై వివరించిన సీఎం
- మరిన్ని సంస్కరణలు, ప్రణాళికలతో ముందుకు వెళ్లాలన్న మల్హోత్రా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 18: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మర్యాదపూర్వక గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. ఆర్బీఐ బోర్డ్ మీటింగ్ కు హాజరయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన నేపథ్యంలో సీఎంను మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలను ఆర్బీఐ గవర్నర్ కు సీఎం వివరించారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు, మూడో డిస్కం ఏర్పాటుపై ఆయనకు వివరించిన సీఎం, సోలార్ విద్యుత్ వినియోగం పెంచే దిశగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. బడ్స్‌యాక్ట్‌ను నోటిఫై చేయాలని ముఖ్యమంత్రిని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను సంజయ్ మల్హోత్రా ప్రశంసించారు. మరిన్ని సంస్కరణలు, ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్ ఫేజ్ విషయంలో ఆర్బీఐ తీసుకుంటున్న చొరవను సీఎంకు మల్హోత్రా వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు డిపాజిట్స్ క్లెయిమ్ క్యాంపెయినింగ్ పై సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్బీఐ హైదరాబాద్ రీజనల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, జనరల్ మేనేజర్లు, మేజర్ యశ్పాల్ చరణ్, ఎస్ పాణిగ్రహి, తదితరులు పాల్గొన్నారు.

గంగకత్వ కాలువ ఆధునీకరణకు ప్రతిపాదనలు

- రూ.101 కోట్లతో కాలువ, చెరువులు, చెక్‌డ్యాంల అభివృద్ధి
- నీటిపారుదల శాఖ అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో హైదరాబాద్ /సంగారెడ్డి, డిసెంబర్ 18: సదాశివపేట గంగకత్వ కాలువను 15 కిలోమీటర్ల పొడవునా ఆధునీకరించేందుకు మూడు రోజుల్లో పూర్తి స్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సెక్రటేరియట్‌లో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమక్షంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు స్పష్టమైన సూచనలు చేశారు. రూ.101 కోట్ల అంచనా వ్యయంతో గంగకత్వ కాలువ ఆధునీకరణతో పాటు సంగారెడ్డి నియోజకవర్గంలోని సదాశివపేట, సంగారెడ్డి, కంది, కొండాపూర్ మండలాల్లో చెరువుల మరమ్మత్తులు, చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిజాం కాలం నాటి గంగకత్వ కాలువ ఆధునీకరణకు ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల చొరవతో, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో బీజం పడిందని సమావేశంలో పేర్కొన్నారు. ప్రతిపాదిత పనుల్లో భాగంగా 15 కిలోమీటర్ల మేర గంగకత్వ కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లు, సదాశివపేట మండలంలోని 30 చెరువుల మరమ్మత్తులకు రూ.10.72 కోట్లు, సంగారెడ్డి మండలంలోని 18 చెరువులకు రూ.9.15 కోట్లు, కంది మండలంలోని 15 చెరువులకు రూ.8.07 కోట్లు, కొండాపూర్ మండలంలోని 4 చెరువులకు రూ.4.16 కోట్లు కేటాయించనున్నారు. అదేవిధంగా సదాశివపేట మండలంలోని నంది వాగు, గంగకత్వ వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.32 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించనున్నారు. గంగకత్వ కాలువ ఆధునీకరణ పూర్తయితే సంగారెడ్డి నియోజకవర్గంలోని 33 చెరువులకు నీరందడంతో పాటు సుమారు 1500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గారెడ్డి మంత్రికి వివరించారు. రైతులకు శాశ్వత ప్రయోజనం చేకూర్చేలా పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అంజాద్ హుస్సేన్, ఎస్ఈ శ్రీనివాస్, డీఈ బాలగణేష్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం

- గ్రామ స్వరాజ్యానికి కాంగ్రెస్ పునాది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కొత్తగూడెంలో ప్రజాప్రతినిధుల అభినందన సభ

ప్రతపక్షం, కొత్తగూడెం, డిసెంబర్18 : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించిందని, ఇది ఇందిరమ్మ పాలనపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గెలుపొందిన 400 మందికి పైగా సర్పంచులను, వేలాది మంది వార్డు సభ్యులను మంత్రి శాలువాలతో సత్కరించి అభినందించారు. సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాజకీయాల్లో ఏ పార్టీ జెండా ఎగరాలన్నా, ఏ నాయకుడి భవిష్యత్తు మారాలన్నా దానికి గ్రామ స్థాయి కార్యకర్తలే పునాది అని కొనియాడారు. పంచాయతీ ఫలితాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను మంత్రి తీవ్రంగా ఖండించారు. ఓటమిని జీర్ణించుకోలేక గులాబీ పార్టీ పత్రికల్లో అంకెల గారడీ చేస్తూ ప్రజలను మసిపూసి మారేడుకాయ చేయాలని చూస్తోందని ఎద్దేవా చేశారు. నిజాయితీగా గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇదే ఫలితం పునరావృతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితమే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో మిత్రపక్షం ఎమ్మెల్యే ఉన్నప్పటికీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని పొంగులేటి స్పష్టం చేశారు. "మీ శీనన్నగా నేను ఉన్నాను.. ఏ ఒక్క కార్యకర్తకు చిన్న నొప్పి తగిలినా అండగా ఉంటా" అని భరోసానిచ్చారు. తృటిలో ఓడిపోయిన అభ్యర్థులను కూడా ఆదుకుంటామని, క్రిస్మస్ పండుగ లోపే ప్రతి నియోజకవర్గంలో విస్తృత స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి గెలిచిన వారిని గౌరవించుకుంటామని ప్రకటించారు. హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందిరాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని మంత్రి పునరుద్ఘాటించారు. గడిచిన రెండేళ్లలో చేసిన సంక్షేమ కార్యక్రమాలే ఈ విజయానికి సోపానాలని ఆయన అన్నారు.

తెలంగాణ వర్సిటీల్లో గ్లోబల్ వెంచర్ ఎడ్యుకేషన్

- నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ బృందం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్18: రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థల్లో వ్యవస్థాపకత, వెంచర్ ఎడ్యుకేషన్ ను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని అమెరికాలోని బోస్టన్కు చెందిన ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. రాష్ట్రంలోని యూనివర్శిటీల నెట్వర్క్ ద్వారా వ్యవస్థాపకతతో వేగవంతమైన పైలట్ ప్రాజెక్టులను చేపట్టేందుకు సహకరించాలని ప్రతినిధుల బృందం తెలంగాణ ఉన్నత విద్యా మండలిని కోరింది. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్యను అంతర్జాతీయాకరించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ఉన్నత విద్యా మండలి అధికారులు ప్రతినిధులకు వివరించారు. ఉన్నత విద్యా రంగంలో గ్లోబల్ వెంచర్ ఎడ్యుకేషన్, వ్యవస్థాపకత పెంపొందించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ అంతర్జాతీయ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ గ్రెగొరీ కొల్లియర్, అడ్వైజరీ బోర్డు సభ్యులు క్రిష్ నంగెగడ్డలతో కూడిన బృందం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి క్లస్టర్ డెవలప్మెంట్ మోడల్ను ఈ బృందం ప్రతిపాదించింది. ఈ సందర్భంగా తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య అంతర్జాతీయాకరణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మండలి అధికారులు వారికి వివరించారు.

బాధ్యతాయుత జర్నలిజమే లక్ష్యం

- జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు అజ్హరుద్దీన్
- 'మౌలానా అబ్దుల్ బాసిత్ అన్వర్' ఫెలోషిప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం, హైదరాబాద్, డిసెంబర్18: విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి అత్యవసరమని జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు ముహమ్మద్ అజ్హరుద్దీన్ అన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర శాఖ ప్రకటించిన 'మౌలానా అబ్దుల్ బాసిత్ అన్వర్ జర్నలిజం ఫెలోషిప్ 2025' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముహమ్మద్ అజ్హరుద్దీన్ మాట్లాడుతూ, నేటి సమాజంలో జర్నలిజం ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావించారు. కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా, నైతిక విలువలతో కూడిన బాధ్యతాయుతమైన జర్నలిజం వైపు విద్యార్థులను ప్రేరేపించడమే ఈ ఫెలోషిప్ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. యువ జర్నలిస్టులు సమాజ హితాన్ని కాంక్షిస్తూ తమ వృత్తిని మలచుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జమాఅతె ఇస్లామీ హింద్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎం. ఫసిఉల్లా ఫెలోషిప్ నిబంధనలను వివరించారు. తెలంగాణలోని కాలేజీలు, వర్సిటీల్లో జర్నలిజం చదువుతున్న ముస్లిం విద్యార్థులు అర్హులని, కనీసం ఒక సెమిస్టర్ పూర్తి చేసి ఉండాలని అన్నారు. ప్రతిభ ఆధారంగా ఎంపికైన వారికి రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఫెలోషిప్ అందజేస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు డిసెంబర్ 31, 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9948011372 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

భవిష్యత్తు విజయాలకు భువనగిరి నుంచే పునాది

- అభివృద్ధి పేరుతో పార్టీలు మారడం సిగ్గుచేటు
- ఫిరాయింపుల విషయంలో స్పీకర్ మౌనం వహిస్తున్నారు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ కేటీఆర్

ప్రతిపక్షం, భువనగిరి, డిసెంబర్18: యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తిరిగి రానుందని, రాబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా పునాది వేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజా బలంతో సాధించిన విజయం పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని తెలిపారు. రెండేళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, తాజా పంచాయతీ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని కేటీఆర్ పేర్కొన్నారు. భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ప్రభావం స్పష్టంగా కనిపించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రాజకీయాలు అత్యంత గలీజుగా మారాయని ఆరోపించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. నూతన్‌కల్‌లో మల్లయ్య యాదవ్ హత్య, నల్గొండలో అభ్యర్థిపై దాడి వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను ఉద్దేశించి తీవ్ర విమర్శలు గుప్పించిన కేటీఆర్, అభివృద్ధి పేరుతో పార్టీలు మారడం సిగ్గుచేటని అన్నారు. స్పీకర్ కూడా ఫిరాయింపుల విషయంలో మౌనం వహిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతుబంధు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. "పాలిచ్చే బర్రెను వదిలి తన్నేదున్నపోతును తెచ్చుకున్నాం" అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలని ఆయన పిలుపునిచ్చారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేసి పార్టీ బీఫామ్‌పై జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు తిరుగులేని విజయం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఎవరి వ్యక్తిగత సొమ్ము కాదని, అవి ప్రజల హక్కులని పేర్కొంటూ, ఏ ఎమ్మెల్యే వాటిని ఆపలేడని భరోసా ఇచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో గత పదేళ్లలో తెలంగాణ సాధించిన అభివృద్ధిని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, చిరుమూర్తి లింగయ్య, నాయకులు పాల్గొన్నారు.

మందాడిపల్లే సర్పంచ్‌గా విజయ

- ఉప సర్పంచ్‌గా సుధాకర్ ఏకగ్రీవ ఎన్నిక

ప్రతిపక్షం, హుజురాబాద్, డిసెంబర్18: కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని మందాడిపల్లే గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో వెల్పుల విజయ ఘన విజయం సాధించారు. ఎన్నికల అనంతరం రిటర్నింగ్ ఆఫీసర్ డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి ఆమెకు అధికారికంగా ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. మందాడిపల్లే గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా మిడిదొడ్డి సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను గ్రామ పెద్దలు, ప్రజలు అభినందించారు. గ్రామాభివృద్ధి, పారదర్శక పాలన, మౌలిక సదుపాయాల మెరుగుదల, స్వచ్ఛత కార్యక్రమాలు, పేదల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ శ్రీమతి వెల్పుల విజయ తెలిపారు. ఉప సర్పంచ్ మిడిదొడ్డి సుధాకర్ కూడా సర్పంచ్‌తో సమన్వయంతో పనిచేస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. గ్రామ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని, మందాడిపల్లే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని నూతన పాలకవర్గం స్పష్టం చేసింది.

"రోడ్డు ప్రమాద బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్లిన వారిని 'రాహ్‌వీర్'(హీరో ఆఫ్ ది రోడ్)గా గుర్తించి రూ.25వేలు రివార్డు ఇస్తాం. పోలీసులు, లీగల్ భయాలు లేకుండా బాధితులకు సాయం చేయాలి. సకాలంలో సాయం అందిస్తే ఏటా దాదాపు 50వేల మందిని కాపాడవచ్చు. బాధితులకు ఏడు రోజుల చికిత్సకు రూ.1.5 లక్షలు ప్రభుత్వమే ఇస్తుంది.

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ఓపెన్ వాయిస్

అవమానమా, అవసరమా?

భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవల మార్చి, విక్సిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) వీబీజీ రామ్ జీ బిల్‌గా పరిచయం చేసింది. ఈ బిల్ 2025 డిసెంబర్ 15న లోక్‌సభలో పరిచయమై, తర్వాత పాస్ అయింది. ఇది 2005లో యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంజీ నరేగాను రీప్లేస్ చేస్తుంది. మరియు ఏప్రిల్ నుంచి అమలు కానుంది. ఈ మార్పు గ్రామీణ ఉపాధి వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలన్న ఉద్దేశంతో జరిగిందని ప్రభుత్వం చెబుతోంది. కానీ విపక్షాలు దీనిని మహాత్మా గాంధీకి అవమానంగా, రాజకీయ కుట్రగా పరిగణిస్తున్నాయి. ఈ వివాదాన్ని విశ్లేషిస్తే, ఇది కేవలం పేరు మార్పు మాత్రమే కాకుండా, దేశ రాజకీయ, ఆర్థిక విధానాల్లో లోతైన మార్పులను సూచిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఈ మార్పును ఒక అవసరమైన సంస్కరణగా వర్ణిస్తోంది. వీబీజీ రామ్ జీ బిల్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో 125 రోజుల ఉపాధి హామీ ఇవ్వడంతోపాటు, జవాబుదారీతనం పెంచడం, కార్మికుల రక్షణ బలోపేతం చేయడం, దీర్ఘకాలిక గ్రామీణ మౌలిక సదుపాయాలు నిర్మించడం వంటి లక్ష్యాలు ఉన్నాయి. రూరల్ డెవలప్‌మెంట్ మినిస్టర్ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ మార్పును సమర్థిస్తూ, "ఇది 20 ఏళ్ల పాత చట్టాన్ని మోడర్నైజ్ చేస్తుంది. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచి, అన్ని ప్రాథమిక సౌకర్యాలు అందించి దేశాన్ని విక్సిత్ భారత్‌గా మార్చడమే లక్ష్యం" అని పేర్కొన్నారు. బిహార్ పంచాయతీ రాజ్ మినిస్టర్ దీపక్ ప్రకాశ్ కూడా ఇది ప్రధాని నరేంద్ర మోదీ దృష్టితో సరిపోతుందని, 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చేసేందుకు సహాయపడుతుందని చెప్పారు. ప్రభుత్వం దృష్టిలో, ఎంజీ నరేగాలో ఉన్న లోపాలు లాగా జవాబుదారీ తనం లేకపోవడం, ఫండ్స్ దుర్వినియోగం ఈ కొత్త స్కీమ్‌తో సరిదిద్దబడతాయి. ఇది రాజకీయ ఉద్దేశాలు లేకుండా, కేవలం అభివృద్ధి లక్ష్యాలతో జరిగిన మార్పు అని వారు వాదిస్తున్నారు. మరోవైపు, విపక్షాలు ఈ మార్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ(ఎం), ఆర్‌జేడీ వంటి పార్టీలు మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని "గాంధీకి అవమానం"గా పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, "పేరు మార్పుకు ఎందుకు అవసరం? ఆఫీసులు, స్టేషనరీ మార్చడానికి ఖర్చు ఎందుకు?" అని ప్రశ్నించారు. తృణమూల్ ఎంపీ డెరెక్ ఓ బ్రియాన్ దీనిని గాంధీ హంతకుడిని హీరోగా చూసే వారి కుట్రగా వర్ణించారు. సీపీఐ(ఎం) ఎంపీ ఎంఏ బేబీ, ఈ బిల్ రాష్ట్రాలపై ఆర్థిక భారం వేస్తుందని, విపక్ష రాష్ట్రాలకు ఫండ్స్ కట్ చేసేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆరోపించారు. ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ కే జా, నరేగా కరోనా సమయంలో గ్రామీణ పేదలను ఆకలి నుంచి కాపాడిందని, ఇప్పుడు దానిని ధ్వంసం చేయడం దేశానికి హానికరమని చెప్పారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తమ రాష్ట్ర 'కర్మశ్రీ' స్కీమ్‌ను గాంధీ పేరుతో మారుస్తామని ప్రకటించి, కేంద్రానికి కౌంటర్ ఇచ్చారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సుర్జేవాలా, "ఇది ఎంజీ నరేగాను బహిరంగంగా హత్య చేయడం" అని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రొటెస్ట్‌లు, బిల్ కాపీలు దహనం చేయడం వంటివి జరిగాయి. ఈ వివాదాన్ని విశ్లేషిస్తే, ప్రభుత్వం ఈ మార్పును అభివృద్ధి సంస్కరణగా చూపిస్తున్నప్పటికీ, దాని వెనుక రాజకీయ ఉద్దేశాలు కనిపిస్తున్నాయి. నరేగాను మోదీ ప్రభుత్వం గతంలో "గుంతలు తవ్వడం"గా విమర్శించింది, మరియు ఇప్పుడు దానిని రీబ్రాండ్ చేయడం ద్వారా కాంగ్రెస్ లెగసీని ఎరేజ్ చేయాలన్న ఉద్దేశం ఉండవచ్చు. అయితే, కొత్త స్కీమ్‌లో టెక్నాలజీ ఇంటర్వెన్షన్లు, రాష్ట్రాల బాధ్యతలు పెంచడం వల్ల గ్రామీణ కార్మికుల హక్కులు బలహీనపడవచ్చు, ముఖ్యంగా విపక్ష రాష్ట్రాల్లో ఫండ్స్ ఆలస్యం లేదా కట్‌లు ఇప్పటికే సమస్యగా ఉన్నాయి. మరోవైపు, విపక్షాల ఆరోపణలు ఎక్కువ భావోద్వేగాత్మకంగా ఉన్నాయి గాంధీ పేరు తొలగించడం నిజంగా అవమానమే అయినప్పటికీ, స్కీమ్ ప్రయోజనాలు మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలి. సోషల్ మీడియాలో కూడా ఇది విభజన సృష్టిస్తోంది. కొందరు దీనిని ప్రగతిశీల సంస్కరణగా చూస్తుంటే, మరికొందరు అనవసరమైన మార్పుగా విమర్శిస్తున్నారు. ముగింపుగా, ఈ పేరు మార్పు దేశ గ్రామీణ అభివృద్ధికి సానుకూలమా లేక రాజకీయ ఆటలకు బలవ్వుతుందా అనేది సమయమే నిర్ణయిస్తుంది. అయితే, ఇలాంటి సంస్కరణలు రాజకీయాలకు అతీతంగా, పేదల ఉపాధి హక్కులను బలోపేతం చేసేలా ఉండాలి. లేకపోతే, ఇది మరిన్ని వివాదాలకు దారి తీస్తుంది.

ప్రతిపక్షం

హైదరాబాద్,

శుక్రవారం
19.12.2025

పల్లె వర్సెస్ పట్టణం..ఎత్తుగడ ?!

గెలిచిన సర్పంచులు డిసెంబర్ 22న ప్రమాణ స్వీకారం చేయబోతుండగా, వెంటనే వెలువడాల్సిన డిసెంబర్ 25 నాటి ఎంపీటీసీ షెడ్యూల్‌ను పక్కన పెట్టి మున్సిపల్ ఎన్నికల వైపు ప్రభుత్వం మొగ్గు చూపడం గమనార్హం. పల్లెల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు 126 మున్సిపాలిటీల్లో ఎన్నికలను ముందుగా నిర్వహించి, పట్టణ ఓటర్లను మేనేజ్ చేయవచ్చనే అంచనాతో సర్కార్ ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఫిరోజ్ ఖాన్
9640466464

తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు ఒక క్లిష్టమైన మలుపు వద్ద నిలిచి ఉంది, ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల ముగిసిన సర్పంచ్ ఎన్నికలలో గ్రామీణ ఓటర్లు ఇచ్చిన తీర్పు అధికార పార్టీకి మింగుడు పడటం లేదని, అందుకే ఎంపిటీసీ, జెడ్పిటీసీ ఎన్నికలను వాయిదా వేసేందుకు కుట్ర జరుగుతోందని ప్రతిపక్షాలు గట్టిగా విమర్శిస్తున్నాయి. గెలిచిన సర్పంచులు డిసెంబర్ 22న ప్రమాణ స్వీకారం చేయబోతుండగా, వెంటనే వెలువడాల్సిన డిసెంబర్ 25 నాటి ఎంపీటీసీ షెడ్యూల్‌ను పక్కన పెట్టి మున్సిపల్ ఎన్నికల వైపు ప్రభుత్వం మొగ్గు చూపడం గమనార్హం. పల్లెల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు 126 మున్సిపాలిటీల్లో ఎన్నికలను ముందుగా నిర్వహించి, పట్టణ ఓటర్లను మేనేజ్ చేయవచ్చనే అంచనాతో సర్కార్ ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ "పల్లె వర్సెస్ పట్టణం" వ్యూహం ప్రభుత్వ అభద్రతా భావానికి నిదర్శనమని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి తప్పించుకోవడానికే ఇటువంటి ఎత్తుగడలు వేస్తున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు.

రైతు సంక్షేమం.. గ్రామీణ తెలంగాణలో ప్రభుత్వంపై వ్యతిరేకత రావడానికి ప్రధాన కారణం రైతులకు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారడమేనని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందకపోవడం, రుణమాఫీ ప్రక్రియలో అనేక సాంకేతిక సాకులు చూపి లక్షలాది మంది రైతులను అనర్హులుగా ప్రకటించడం పల్లెల్లో ఆగ్రహానికి దారితీసింది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ రైతు రోషన్ సదాశివు కేవలం ఒక లక్ష రూపాయల అప్పుతో మొదలై, అది 74 లక్షలకు చేరడంతో తన కిడ్నీని 8 లక్షలకు అమ్ముకున్న ఉదంతం ఇక్కడ చర్చనీయాంశమవుతోంది. పల్లె ఓటరు తమను నిలదీస్తాడనే భయంతోనే ప్రభుత్వం ఎంపిటీసీ ఎన్నికలను పక్కన పెట్టి పట్టణాల వైపు దృష్టి సారిస్తోందని, ఇది రైతన్నను మోసం చేయడమేనని బీఆర్ఎస్, బీజేపీ0 నేతలు ధ్వజమెత్తుతున్నారు. కేవలం హైదరాబాద్ చుట్టుపక్కల మెరుపులు మెరిపిస్తూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను విస్మరించడం వల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ఇక్కడి రైతుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు హెచ్చరిస్తున్నారు. అగ్రికల్చర్ ఆఫీసర్ల సలహాలు లేకుండా, కేవలం రాజకీయ లబ్ధి కోసం పంటల మార్పిడి గురించి మాట్లాడటం, రైతులకు భరోసా కల్పించడంలో వైఫల్యం చెందడం పల్లెల్లో ప్రభుత్వ గ్రాఫ్‌ను గణనీయంగా తగ్గించేశాయి.

నిధుల మళ్లింపు ఆరోపణలు.. భారతదేశ రాజ్యాంగం కల్పించిన స్థానిక స్వపరిపాలన హక్కులను ఈ ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని, గ్రామాలకు అందాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను దారి మళ్లిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఐదంచెల పాలనా వ్యవస్థలో ఫైనాన్స్ కమిషన్ ద్వారా వచ్చే నిధుల్లో 70 శాతం నేరుగా గ్రామ పంచాయతీలకే చేరాలనే నిబంధన ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆ నిధులు అందక సర్పంచులు అప్పులపాలవుతున్నారు. మరోవైపు 20 శాతం మండల పరిషత్‌లకు, 10

శాతం జిల్లా పరిషత్‌లకు అందాల్సిన వాటాను కూడా ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయడం లేదని, స్థానిక ప్రజా ప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడం వల్ల గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, ఇది పల్లె ప్రజల్లో తీవ్ర అసహనానికి దారితీసిందని విశ్లేషకులు చెబుతున్నారు. పల్లెల్లో రోడ్లు, డ్రైనేజీలు మరియు కనీస వసతులు కల్పించలేని ప్రభుత్వం, పట్టణాల్లో భారీ ప్రాజెక్టుల పేరుతో కాలయాపన చేస్తోందని, ఇది ప్రాంతీయ వివక్షను పెంచడమేనని ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నారు. అధికార వికేంద్రీకరణ ద్వారా గ్రామాల అభివృద్ధి జరగాలన్న లక్ష్యం కాగితాలకే పరిమితమైందని, స్థానిక సంస్థలకు పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని వారు వాదిస్తున్నారు.

ప్రచార ఆర్భాటాలు.. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని చెబుతూనే, ప్రచార ఆర్భాటాల కోసం సుమారు 100 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ప్రభుత్వం వృథా చేస్తోందని ప్రతిపక్షాలు ఘాటుగా విమర్శిస్తున్నాయి. అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ పర్యటన కోసం సింగరేణి సంస్థ నుండి 10 కోట్లు, ఎంసిహెచ్‌ఆర్డిలో ప్రత్యేక కోర్టు కోసం 5 కోట్లు మళ్లించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల భవనాలు కూలిపోతున్నా, ఆసుపత్రుల్లో మందులు లేకపోయినా పట్టించుకోని ప్రభుత్వం, కేవలం బ్రాండింగ్ పేరుతో ఇటువంటి ఆడంబరాలకు ప్రాధాన్యత ఇవ్వడం దారుణమని వారు మండిపడుతున్నారు. మెస్సీ విడుదల చేసిన వీడియోలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆడిన దృశ్యాలు లేకపోవడం, కేవలం ఫోటోల కోసమే కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును ధారపోశారనడానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. పట్టణాల్లో ఇటువంటి మెరుపులు మెరిపించి ఓట్లు రాబట్టుకోవాలనే వ్యూహం పల్లె ప్రజలను అవమానించడమేనని, ప్రజల పన్నుల సొమ్ముకు జవాబుదారీతనం లేకపోవడం ప్రభుత్వ నిరంకుశ ధోరణికి పరాకాష్ట అని ప్రతిపక్ష నేతలు నిలదీస్తున్నారు.

బీసీ రిజర్వేషన్ల వివాదం.. బీసీ కుల గణన మరియు రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పట్ల కూడా ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు 50 శాతం లోపు నిబంధనల పేరుతో కాలయాపన చేయడం వెనుక బీసీ ఓట్లు చేజారిపోతాయనే భయం దాగి ఉందని వారు విమర్శిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎంపిటీసీ మరియు జెడ్పిటీసీ ఎన్నికల్లో గట్టి గుణపాఠం తప్పదని భావించే ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల సాకుతో తప్పించుకుంటోందని ఆరోపణలు వస్తున్నాయి. సామాజిక న్యాయం గురించి మాట్లాడే నాయకులు క్షేత్రస్థాయిలో అధికారాల బదలాయింపుకు వచ్చేసరికి వెనకడుగు వేయడం వారి ద్వంద్వ విధానాలకు నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ, వారిని కేవలం ఓటు బ్యాంకుగా వాడుకోవాలని చూడటం సమంజసం కాదని, రాబోయే ఎన్నికల్లో బీసీలు తగిన బుద్ధి చెబుతారని ప్రతిపక్ష నేతలు హెచ్చరిస్తున్నారు.

ప్రజల అంతిమ తీర్పు.. మొత్తానికి "పల్లె వర్సెస్ పట్టణం" అనే సమీకరణం ద్వారా తెలంగాణ రాజకీయాలను రెండుగా చీల్చాలని ప్రభుత్వం చూస్తోందని, ఇది అభివృద్ధికి ఎంతమాత్రం మంచిది కాదని ప్రతిపక్షాలు స్పష్టం చేస్తున్నాయి. పల్లెల్లో వైఫల్యాలను పట్టణాల్లో ప్రచారాలతో కప్పిపుచ్చలేరని, ఓటరు ప్రతి అంశాన్ని నిశితంగా గమనిస్తున్నారని వారు హెచ్చరిస్తున్నారు. స్థానిక ఎన్నికలను నిర్ణీత సమయంలో నిర్వహించకుండా, తమకు అనుకూలమైన చోట మాత్రమే ముందుగా జరపాలని చూడటం ప్రజాస్వామ్య వ్యవస్థపై సర్కారుకు ఉన్న అపనమ్మకాన్ని సూచిస్తోంది. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా, కేవలం అధికారాన్ని కాపాడుకోవడం కోసమే వ్యూహాలు పన్నుతున్నారని, ఇది అంతిమంగా ప్రభుత్వ పతనానికే దారితీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పల్లె ఓటర్లు ఇప్పటికే తమ నిరసనను వ్యక్తం చేశారని, ఇప్పుడు పట్టణ ఓటర్లు కూడా వాస్తవాలను గ్రహించి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని ప్రతిపక్షాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఏ ప్రభుత్వం కూడా ప్రజల ప్రాథమిక సమస్యలను విస్మరించి చిరకాలం అధికారంలో ఉండలేదని, రాబోయే తీర్పు ఈ విషయాన్ని మరోసారి నిరూపిస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.

(వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు)

'పుస్తకాలు మనో మాలిన్యాలను తొలగించే దీపాలు'

సంపతి రమేష్ మహారాజ్
7989579428

పుస్తకం ఓ మంచి నేస్తం. ఓ మంచి పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం అనుభవించే వాళ్లకే తెలుస్తోంది. పుస్తకం అమ్మలా లాలిస్తుంది, నాన్నలా ఆదరిస్తుంది, గురువులా హితబోధ చేస్తుంది, ఒంటరితనంలో స్నేహితుడిలా అక్కున చేర్చుకుంటుంది, బాధపడే వారిని ఓదారుస్తుంది. మనిషిలో మానసిక పరివర్తనను తీసుకువస్తుంది. అలసిన మనసులకు సేద తీర్చుతుంది. అందుకే పుస్తకం అనితరమైన ఆయుధంగా, నేస్తంగా సమస్తంగా అన్ని తరాలవారినీ అలరిస్తోంది. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి దారి చూపెట్టే సాధనం. మనోవికాసానికి, మార్గనిర్దేశానికి గురువులా ఉపయోగపడుతుంది. అందుకే జీవితంలో నిజమైన నేస్తం.. పుస్తకం. మానవజీవన గమనం, విధానంలో పుస్తకాలు వచ్చాక విప్లవాత్మక మార్పులు వచ్చాయంటే నమ్మాల్సిందే. ఆధునిక జీవన విధానం చుట్టుముడుతున్న ఈ రోజుల్లోనూ పుస్తక పఠనాన్ని ఇష్టపడేవారూ తగ్గలేదని యునెస్కో చెప్పింది. పుస్తకాలు గొప్ప ఆలోచనకు పదును పెట్టి అనేక ఆవిష్కరణలు చేయడానికి తోడ్పడతాయి. మనుషులలో అజ్ఞానం ఛాయలు తొలగిపోయి విజ్ఞానం వైపు నడిపించే నావ ఓ మంచి పుస్తకం. "పుస్తకాలు మనో మాలిన్యాలను తొలగించే దీపాలు"అని భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేర్కొన్నారు. మనిషి మేధస్సును విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతో దోహదపడతాయనడంలో సందేహం లేదు. ఒకసారి విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తుదివరకు జీవితాన్ని నడిపిస్తుంది. పుస్తకాలు చదవడం అంటే మానవత్వాన్ని పంచుకోవడం. ఇతరుల జీవితాల్లోకి అడుగుపెట్టడానికి, వారి కళ్లతో ప్రపంచాన్ని చూడటానికి, వారితో సహానుభూతి చెందడానికి పుస్తక పఠనం వీలు కల్పిస్తుంది. చిన్నప్పటి నుంచి పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు చేస్తే అదే అలవాటుగా మారి యువతరం అన్ని విషయాల్లో పోటీపడినట్లే పుస్తకాలు చదవటంలో పోటీపడతారు.

పుస్తక విజ్ఞానంతో ఉన్నత శిఖరాల వైపు..

నేడు సాంకేతిక విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న కొద్ది చాలామంది ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలతో కాలాన్ని వృథా చేస్తున్నారు. మంచి పుస్తకం చదవటానికి మక్కువ చూపటం లేదు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో పుస్తక భాండాగారం పరిచయం చేసేది గొప్ప వేడుక హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన. ఈ పుస్తక ప్రదర్శన 1985లో 'హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ' ద్వారా ప్రారంభమైంది, దీని ప్రధాన లక్ష్యం పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం, ఇది ప్రతి ఏటా డిసెంబర్ నెలల్లో ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతుంది, తెలుగు, ఇతర భాషల ప్రచురణ సంస్థల స్టాల్స్, సాహిత్య కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పుస్తక ప్రియులకు ఒక పెద్ద వేదికగా నిలుస్తుంది, ఇది హైదరాబాద్‌లో ఒక ముఖ్యమైన సాహిత్య పండుగ. ఈ సంవత్సరం హైదరాబాద్‌లో 38వ బుక్ ఫెయిర్ డిసెంబర్ 19 నుండి 29 వరకు ఎన్టీఆర్ స్టేడియంలో జరగనుంది. ఈ పుస్తక ప్రదర్శన ప్రాంగణం అందెశ్రీ పేరుతో నిర్వహిస్తున్నారు. పుస్తక ప్రియులను ప్రోత్సహించే గొప్ప వేడుక ఇది. 300 పైన స్టాళ్ళతో ఎంతోమంది గొప్ప రచయితలు, కవులు తన అక్షర సేద్యంతో రాసిన పుస్తకాలను ప్రదర్శిస్తారు. ఈ పుస్తక ప్రదర్శనను అందరూ సందర్శించి పుస్తక విజ్ఞానాన్ని అధ్యయనం చేసి మేధావులుగా మారగలరు. ప్రతి ఒక్కరు మంచి పుస్తకాలను ఎంపిక చేసుకొని కొనుక్కోవాలంటే పుస్తక ప్రదర్శనలు సందర్శించాలి. వాటిని చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి అవకాశం ఉంటుంది. పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకొని వాటి శక్తిని తెలుసుకోండి.

(హైదరాబాద్ బుక్ ఫెయిర్ – డిసెంబర్ 19 నుంచి 29 వరకు)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

జీతం ఆశించని ఎమ్మెల్యే సీఎం అయితే!?

జనగాం ప్రసాద్ రావు
76720 82695

రాజకీయాలు అంటే లాభం. పదవి అంటే సంపాదన. ఎన్నిక అంటే పెట్టుబడి. ఈ మూడు మాటలు ఈ దేశ రాజకీయాలకు డిక్షనరీలా మారిపోయిన సమయంలో.. ఒక వ్యక్తి మాత్రం ఈ నిర్వచనాలన్నింటినీ తలకిందులు చేశాడు. ఆయన పేరు.. గుమ్మడి నర్సయ్య.

ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాయకుడు. కానీ ఒక్కసారి కూడా "ఈ పదవి నాకు ఎంత ఇచ్చింది?" అని లెక్క వేసుకోని అరుదైన రాజకీయవేత్త. అలాంటి వ్యక్తి ఒకవేళ తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుంది? ఇది ఊహ కాదు.. ఇది ఈ రాజకీయ వ్యవస్థకు వేసే ప్రశ్న. సీఎం కుర్చీకి ధర కట్టే రాజకీయాల్లో ధరలేని మనిషి సీఎం అయితే? ఈ రోజు సీఎం కుర్చీ అంటే వేల కోట్ల లావాదేవీలు. మంత్రివర్గంలో చోటుకు బేరాలు. శాఖల పంపకం వెనుక కమిషన్లు. ఇదే అసలు రాజకీయ వాస్తవం. కానీ గుమ్మడి నర్సయ్య రాజకీయ జీవితాన్ని చూస్తే ఈ వ్యవస్థ మొత్తం అతనికి పరాయి. ఎమ్మెల్యేగా జీతం తీసుకోకుండా జీతాన్ని పార్టీకి ఇచ్చిన వ్యక్తి సీఎం అయితే.. సీఎం కార్యాలయం వ్యాపార కేంద్రంగా మారదు. మంత్రులు "ఎంత ఇచ్చారు?" అని కాదు.. "ఎంత పనిచేశారు?" అని లెక్కవుతారు. సీఎం నర్సయ్య అయితే.. మొదటి దెబ్బ ఎవరి మీద పడుతుంది? మొదటి దెబ్బ దళారీ వ్యవస్థ మీద. ఈ రోజు ప్రభుత్వ పథకం అంటే మధ్యలో బ్రోకర్లు, కమిషన్ల కాసులు, ఫైల్స్ కదలాలంటే కవర్లు. కానీ నర్సయ్య రాజకీయ జీవితం మొత్తం ఈ మధ్యవర్తుల మీద పోరాటమే. సీఎం నర్సయ్య అంటే.. పథకం నేరుగా ప్రజల దగ్గరకు. మధ్యలో పేర్లు, శాతం, వాటాలు ఉండవు. ఇది ఊహ కాదు.. తని జీవితం చెప్పే నిజం.

సాధారణ ఎమ్మెల్యేగా ఉండి సాధారణంగా జీవించిన వ్యక్తి సీఎం అయితే.. అధికారానికి అర్థం మారిపోతుంది. ఈరోజు చాలా మంది నాయకులు ఎమ్మెల్యే అవగానే ఇళ్లు మారతారు. కార్లు మారతారు. జీవితం మారుతుంది. కానీ నర్సయ్య విషయం లో ఎన్నిక ఫలితం మారింది కానీ జీవితం మారలేదు. అలాంటి వ్యక్తి సీఎం అయితే.. అధికారం అంటే భోగం కాదు. బాధ్యత అని ప్రజలకు అర్థమవుతుంది. సీఎం నర్సయ్య అంటే.. ఫైల్ కదలాలంటే ఫోన్ కాల్ అవసరం లేని పాలన. ఈ రోజు సామాన్యుడు, ఒక పనికోసం ఎమ్మెల్యే దగ్గర, మంత్రుల దగ్గర, చివరకు పీఏ దగ్గర చుట్టాలు తిరుగుతాడు. కానీ నర్సయ్య రాజకీయ శైలి "ఎవరి పని వాళ్లకే హక్కు". సీఎం నర్సయ్య అంటే.. ప్రజలకు తలుపులు, అధికారులకు గడులు, కాంట్రాక్టర్ల ప్రభుత్వానికి గ్రామస్థుడి ప్రభుత్వం ఎదురైతే? ఈ రోజు పాలన అంటే రోడ్లు కాదు.. రేట్లు పథకాలు కాదు.. పర్సంటేజీలు కానీ నర్సయ్య జీవితమంతా గ్రామాలతో, కూలీలతో, రైతులతో అలాంటి వ్యక్తి సీఎం అయితే.. కాంట్రాక్టర్ సీఎం కాదు.. కూలీ సీఎం. అంటే, రాష్ట్ర పాలన దిశ మారుతుంది.

నిజానికి భయం ఎందుకు?

ఇలాంటి వ్యక్తి సీఎం అవుతాడంటే దోచుకున్నవాళ్లకు, వ్యవస్థను వాడుకున్నవాళ్లకు పదవిని పెట్టుబడిగా చూసినవాళ్లకు. అందుకే ఇలాంటి నాయకులు ప్రజాదరణ పొందినా పెద్ద కుర్చీలకు దూరంగా ఉంచబడతారు. ప్రశ్న ఇదే.. ఒక గుమ్మడి నర్సయ్య సీఎం అయ్యే రాష్ట్రం కావాలా? లేదా వందల మంది నర్సయ్యల్ని, ఎమ్మెల్యేలుగా మాత్రమే చూసి వేల కోట్ల రాజకీయాలను భరించే రాష్ట్రం కావాలా? సూటిగా గుమ్మడి నర్సయ్య సీఎం అయితే తెలంగాణకు కొత్త పథకాలు రావు.. కానీ కొత్త రాజకీయ సంస్కృతి వస్తుంది. అదే ఈ రాష్ట్రానికి అత్యవసరమైన అభివృద్ధి.

(వ్యాస రచయిత సామాజిక కార్యకర్త)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాస రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 18: ఆకర్షణీయమైన ప్రకటనలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మబలుకుతూ సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు సూచించారు.తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రారంభమైన "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా, సైబర్ నేరాలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పోస్టర్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికే రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు తదితర రద్దీ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన సైబర్ నేరాల పోస్టర్లు ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్, బస్సు స్టాండ్ లలో, మార్కెట్లలో వంటి ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రధానంగా "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు మరింత జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అదేవిధంగా నకిలీ ఆన్లైన్ ట్రేడింగ్ యాప్లు, వెబ్సైట్లు రూపొందించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పుతూ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్బుక్, ఇమెయిల్‌ల ద్వారా లింకులు పంపి మోసపూరిత వాగ్దానాలతో డబ్బులు బదిలీ చేయించుకుని మోసం చేస్తున్న ఘటనల పై పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇలాంటి మోసపూరిత ఆఫర్లను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, అనుమానాస్పద కాల్స్ లేదా లింకులు ఎదురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని, లేక సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్ మహేందర్, సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్,ఆర్ ఐ శైలందర్,ఆర్ ఎస్సై నరేష్, సైబర్ క్రైమ్ సిబ్బంది సయ్యద్, సాయికిరణ్ పాల్గొన్నారు.

న్యూ ఇయర్ ఈవెంట్స్ లో నిబంధనలు పాటించాలి

- ఉల్లంఘిస్తే ఫామ్‌హౌస్ యజమానులపై చర్యలు
- రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 18: ఫామ్‌హౌస్‌లలో నిర్వహించే న్యూ ఇయర్ వేడుకలు చట్టబద్ధంగా జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఫామ్‌హౌస్ యజమానులపై చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్‌గౌతమ్ తెలిపారు. మొయినాబాద్,చేవెళ్ల పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఫామ్‌హౌస్ యజమానులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరం 2026 వేడుకలు బాధ్యతాయుతంగా, చట్టబద్ధంగా, సురక్షితంగా నిర్వహించాల్సిందిగా స్పష్టం చేశారు. డ్రగ్స్‌కు పూర్తిగా నో చెప్పాలని, ఈవెంట్ ప్రాంగణంలో లేదా పరిసర ప్రాంతాల్లో ఎలాంటి మత్తు పదార్థాలు, నార్కోటిక్ లేదా సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం, నిల్వ లేదా విక్రయం జరగకూడదని కఠినంగా ఆదేశించారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఏ విధమైన అక్రమ కార్యకలాపాలైనా కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతించిన సమయానికి లోపే ఈవెంట్లు ముగించాలన్నారు. సంగీత కార్యక్రమాల శబ్దం ప్రాంగణం దాటి వినిపించకూడదని ఆదేశించారు. ప్రజల నుండి లేదా పొరుగువారి నుండి ఫిర్యాదులు వస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవెంట్లలో డ్రగ్ దుర్వినియోగాన్ని అరికట్టే పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. అక్రమ మద్యం విక్రయం, సేవనం పూర్తిగా నిషేధమని డీసీపీ స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖ అనుమతి లేకుండా మద్యం సరఫరా చేయరాదన్నారురు. నగ్న నృత్యాలు, అశ్లీల హావభావాలు, అభ్యంతరకర ప్రదర్శనలు లేదా సినిమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎలాంటి గేమింగ్ లేదా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహించరాదని ఆదేశించారు. ఈవెంట్ ప్రాంగణంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలనిసూచించారు. అలాగే డోర్ ఫ్రేమ్ డిటెక్టర్లు, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తగినంత ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, మహిళా భద్రతా సిబ్బంది సహా నియమించాలని తెలిపారు. ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే, సామాజిక విభేదాలను రెచ్చగొట్టే లేదా మతపరమైన భావాలను దెబ్బతీసే ఎలాంటి చర్యలైనా పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈవెంట్ సమయంలో జరిగే ఏ విధమైన నష్టం, అపఘాతం లేదా అసౌకర్యానికి నిర్వాహకులే పూర్తిగా బాధ్యులని తెలిపారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఏసీపీ బి. కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్ రెడ్డి, ఫామ్‌హౌస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పార్కింగ్ యార్డ్ గా ఆల్విన్ కాలనీ లాస్ట్ బస్ స్టాప్

- రాజకీయ నాయకుల అండతో పైసా వసూల్!

కూకట్ పల్లి, ప్రతిపక్షం, డిసెంబర్ 17: ఆల్విన్ కాలనీ ఫేజ్-IIలో ఉన్న ఓ బహిరంగ స్థలాన్ని బస్ స్టాప్‌గా వినియోగుస్తుండగా, దాన్ని అక్రమంగా ప్రైవేట్ వాహనాల పార్కింగ్ యార్డ్‌గా మార్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ స్థలం హైడ్రా పరిధిలోని ప్రభుత్వ భూమి కాగా, గతంలో అక్రమ ఆక్రమణలు జరగకుండా హైడ్రా అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అదే స్థలంలో ఆర్టీసీ బస్ స్టాండ్ బస్ లు నిలిచేలా కొంత భాగాన్ని బస్ స్టాప్ కోసం కేటాయించారు, ఇది కాలనీ వాసులకు ఎంతో కీలకమైన ప్రజా రవాణా సౌకర్యంగా ఉంది.అయితే, ఆల్విన్ కాలనీ ఫేజ్-IIకి చెందిన కీలక నాయకుడు ఈ బస్ స్టాప్ స్థలంలో అక్రమంగా ప్రైవేట్ వాహనాలను పార్కింగ్ చేయిస్తూ, ఎటువంటి అనుమతులు లేకుండా పార్కింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ అక్రమ పార్కింగ్ కారణంగా ఆర్టిసి బస్సులు సరిగా నిలపలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా బస్సులు రోడ్డు మీదే ఆగాల్సి వస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల భయం పెరుగుతోంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు చెబుతున్నారు.ఈ స్థలం ప్రజా రవాణా కోసం కేటాయించబడింది. కానీ కొందరు వ్యక్తిగత లాభాల కోసం దాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. బస్సులు ఆగలేక ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు, అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశాడు.ఈ నేపథ్యంలో, అక్రమ పార్కింగ్ నిర్వహిస్తున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ వాహనాలను తొలగించి ఆర్టిసి బస్ స్టాప్‌ను పూర్తిగా ప్రజల వినియోగానికి కేటాయించాలని స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. అలాగే హైడ్రా భూముల దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని కోరుతున్నారు. సమస్యను పట్టించుకోకపోతే ఉన్నతాధికారులను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 18: మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల శ్రీకాంత్ (35) బుధవారం సాయంత్రం ఇంటి నుండి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాలేదు. అతని భార్య పెండ్యాల నీతూ ఫోన్ చేయగా కలవకపోవడంతో చుట్టుపక్కల, బంధు మిత్రుల దగ్గర వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆదివాసీ ఆత్మగౌరవానికి దక్కిన చారిత్రక విజయం

ప్రతిపక్షం, గుండాల, డిసెంబర్ 18: గుండాల మండలంలోని ముత్తాపురం గ్రామపంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన కల్తి రాధా అంచనాలకు మించి ఘన విజయం సాధించి రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేశారు. ఇది కేవలం ఒక వ్యక్తి గెలుపు మాత్రమే కాదు ఆదివాసీ సమాజ ఆత్మగౌరవం, ఐక్యత, చైతన్యానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక ఘట్టంగా నిలిచింది.ఆదివాసీ ముద్దు బిడ్డగా ప్రజల మధ్యే ఎదిగి, వారి కష్టసుఖాలను దగ్గరగా చూసిన కల్తి రాధా, గ్రామ ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. అధికార, ధనబల రాజకీయాలకు ఎదురీడి, ప్రజల నమ్మకమే తన బలంగా ఎన్నికల బరిలో నిలబడి ఘన విజయం సాధించడం విశేషం.ఈ విజయంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మద్దతు కీలక పాత్ర పోషించింది. గ్రామాభివృద్ధి, సామాజిక న్యాయం, ఆదివాసీల హక్కుల పరిరక్షణ వంటి అంశాలను ప్రధానంగా తీసుకుని చేసిన ప్రచారం ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించింది. ఫలితంగా ముత్తాపురం గ్రామ పంచాయతీ ప్రజలు కల్తి రాధాకు పట్టం కట్టారు.ఈ విజయం ద్వారా ముత్తాపురం గ్రామపంచాయతీ చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఇది స్వతంత్ర అభ్యర్థుల శక్తికి, ప్రజాస్వామ్య విలువలకు, ఆదివాసీ ఉద్యమాల బలానికి నిదర్శనంగా నిలుస్తుంది.

కోవిల్వాయి సర్పంచ్‌గా బీజేపీ అభ్యర్థి చుక్క వనిత

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్18: హనుమకొండ జిల్లా, దామెర మండలం, కోవిల్వాయి గ్రామంలో ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు అత్యంత ఉత్కంఠభరితంగా సాగాయి. నువ్వా-నేనా అన్నట్లుగా జరిగిన ఈ పోటీలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బలపరిచిన అభ్యర్థి శ్రీమతి చుక్క వనిత కేవలం 10 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ శ్రీమతి చుక్క వనిత మాట్లాడుతూ, గ్రామ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాజకీయ దురుద్దేశాలకు తావు లేకుండా, అన్ని వర్గాల ప్రజలను సమానంగా గౌరవిస్తూ, గ్రామాభివృద్ధి దిశగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఎల్లవేళలా ప్రజల మన్ననలు పొందేలా పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. తన విజయానికి అండగా నిలిచిన పరకాల బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్ కాలి ప్రసాదరావు, గురజాల రామ్‌రెడ్డి, నాగరాజ్, అలాగే తన భర్త మహేందర్ గారికి ఈ సందర్భంగా ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

రోజ్ గార్ బిల్లు ను ఉపసంహరించుకోవాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 18 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2005 ను రద్దు చేసే ఉద్దేశంతో ప్రతిపాదించిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025' (విజి బి రామ్ జి) ను నరెగా సంఘర్ష్ మోర్చా, డీబీఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ చెప్పారు. సంగారెడ్డి లో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ కార్మికులతో గానీ, కార్మిక సంఘాలతో గానీ ఎటువంటి సంప్రదింపులు జరపకుండా ప్రవేశపెట్టిన ఈ బిల్లు, చట్టబద్ధమైన హక్కుల ఆధారిత వ్యవస్థను, కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి జవాబుదారీతనం లేని బడ్జెట్ పరిమితులతో కూడిన ఒక సాధారణ పథకంగా మార్చేస్తుందన్నారు.ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసహంహరించుకొవాలని డిమాండ్ చేశారు. కార్మికులు మరియు వారి సంఘాల అనుమతి లేకుండా యంజిఎన్‌అర్ జిఎ ను రద్దు చేసే లేదా మార్చే ఏ ప్రయత్నమైనా ఆమోదయోగ్యం కాదని, గ్రామీణ కార్మికుల జీవనోపాధికి మూలస్తంభమైన ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి, ఈ ఏకపక్ష నిర్ణయాలను ప్రతిఘటించాలని మేము అన్ని ప్రజాస్వామ్య శక్తులకు పిలుపునిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ జనసమితి మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీ, సామాజిక కార్యకర్త బంగారు కృష్ణ, గీత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ముందు నిరసన

- కాంగ్రెస్ నాయకుల అరెస్టు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 18 : నేషనల్ హెరాల్డ్ కేసులో గత పదేళ్లుగా ఏఐసిసి అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లను బీజేపీ ప్రభుత్వం వేధిస్తున్నందుకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ కార్యలయం ముందు నిరసన చేపట్టాలని ఏఐసీసీ, పీసీసీ ఇచ్చిన పిలుపు ఉద్రిక్తంగా మారింది. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ల ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయం ముందు నిరసన తెలిపేందుకు బయలుదేరారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద డీసీసీ, నగర కాంగ్రెస్ అధ్యక్షులను అడ్డుకొని అరెస్టు చేశారు. అలాగే మరి కొంతమందిని ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలో వద్ద అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. మరి కొంతమంది బీజేపీ కార్యాలయం వద్దకు చేరుకోగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అదే సమయంలో బీజేపీ కార్యాలయంలో ఉన్న బీజేపీ నాయకులు బయటకు వచ్చి వారితో వాగ్వాదానికి దిగటంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు అక్కడే ఉన్న వారిని రెండువైపులా లాక్కెళ్ళారు. కాంగ్రెస్ నాయకులను అటువైపు వెళ్లకుండా అరెస్టు చేసి వ్యాన్లో వివిధ పోలీస్ స్టేషనులకు తరలించారు. కోర్టు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై ఈడి కేసులను తప్పుబట్టిన నేపథ్యంలో బీజేపీ అరాచాకాలను నిలదీస్తూ నిరసన కార్యక్రమం తెలిపామని ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి తెలిపారు.

విద్యతో పాటు క్రీడలలో రాణించాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- రాష్ట్రస్థాయి 11వ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్18 : క్రీడలు వ్యక్తిని ఉన్నతంగా తీర్చిదిద్దడమే కాకుండా, మానసికశారీరక ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం పటాన్చెరువు మండలంలోని ఇస్నాపూర్ తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ లో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గురుకుల పాఠశాలలో జాతీయ జెండాతో పాటు స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. క్రీడాకారులతో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని, క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి 11వ స్పోర్ట్స్ మీట్‌కు సంగారెడ్డి జిల్లా వేదిక కావడం ఎంతో సంతోషకరమన్నారు. నిత్యజీవితంలో ముఖ్యంగా అమ్మాయిలకు క్రీడలు, ఫిట్నెస్ అత్యంత అవసరమని తెలిపారు.పాఠశాల, కళాశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడల్లో ప్రావీణ్యం సాధించిన క్రీడాకారులు విద్య, ఉద్యోగాలు మాత్రమే కాకుండా జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జిల్లాలో జరగడం హర్షించదగ్గ విషయం అన్నారు. క్రీడా పోటీల నియమ నిబంధనల ప్రకారం విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. క్రీడల ద్వారా అమ్మాయిలు శారీరకమానసిక దృఢత్వాన్ని పొందించుకోవచ్చన్నారు. వివిధ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలను కళాశాలల్లో చదివే విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు 35 విభాగాలకు చెందిన నిష్ణాతులైన కోచ్‌లతో విద్యార్థులకు వారికి ఆసక్తి ఉన్న క్రీడలలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల కోఆర్డినేటర్ కల్పన, పటాన్చెరువు తహసీల్దార్ రంగారావు, అధికారులు, ప్రిన్సిపాళ్లు, పీఈటీలు, పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



అందరి సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 18 : అందరి సహకారంతో జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లాలో మూడు విడతలలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు సాఫీగా ముగిసిన నేపథ్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను, ఇతర నోడల్ అధికారులను జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్ రావు సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది అందరూ పరస్పర సమన్వయంతో కృషి చేసిన ఫలితంగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించుకోగలిగామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోనూ ఇదే తరహాలో సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

"



లోక్‌సభలో కాంగ్రెస్, ఇండీ కూటమి ఎంపీలు ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా వ్యవహరించారు. బల్లలపైకి ఎక్కి, పేపర్లు చించేసి అభ్యంతరకరంగా ప్రవర్తించారు. వారి తీరును ఖండిస్తున్నాను. పేదల సంక్షేమమే బీజేపీ సంకల్పం. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు మోదీ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. అందుకే 25 కోట్ల మంది దారిద్ర్యరేఖ నుంచి బయటపడ్డారు.

- కేంద్ర మంత్రి శివ్‌రాజ్ సింగ్ చౌహాన్

ప్రాంతీయం

ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాల్లో వెనుకబాటు

- అధికారులపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 18: జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు ఆశించిన స్థాయిలో జరగకపోవడంపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో జిల్లాలోని ఉద్యాన వన శాఖ, ఆయిల్ ఫ్రైడ్, మైక్రో ఇరిగేషన్ కంపెనీ అధికారులతో ఆయిల్ ఫామ్ సాగు పెంపు పైన జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 13576ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం 6500 ఎకరాల లక్ష్యానికి గాను 2998 ఎకరాల శాంక్షన్ 1536 ఎకరాలు మాత్రమే ప్లాంటేషన్ పూర్తి చేశారని ఆశించిన స్థాయిలో ఆయిల్ ఫామ్ సాగు లేదని అసహనం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ పూర్తి అయినందున రైతులు రబీ సీజన్ కి సన్నద్ధం అయ్యేలోపు జిల్లాలోని ప్రతి ఒక్క రైతుని కలిసి ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ప్రతి ఒక్క అధికారి పని చెయ్యాలని ఆదేశించారు. ఈ వారం మొత్తం స్పెషల్ డ్రైవ్ గా తీసుకుని ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించి మీకు ఇచ్చిన టార్గెట్ తప్పనిసరిగా చేరుకోవాలని ప్రతి రోజు పని తీరును పర్యవేక్షణ చెయ్యాలని డిఎచ్ఓ సువర్ణ నీ ఆదేశించారు. ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకం అని రెండు సంవత్సరాల వరకు అంతర పంటలు వేసుకోవచ్చు అని మూడవ సంవత్సరం నుండి ఆయిల్ ఫామ్ గెలలు వస్తాయని నాలుగో సంవత్సరం నుండి పంట వస్తుందని రైతులకు ఒక నమ్మకం కలిగించేలా ప్రతి ఒక్క అధికారి పని చెయ్యాలని ఆదేశించారు. ఆయిల్ ఫామ్ కర్మాగారం మన జిల్లాలోని ఉన్నందున ఎక్కువ మొత్తంలో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ చేయించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు వివరించాలి

- ఆయిల్ పామ్ పై అవగాహన కల్పించాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18: రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఇబ్బందులు దూరం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ పై వివరించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. ఫెర్టిలైజర్ యాప్ పై అవగాహన, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాల సాధనపై సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదికలో ఫెర్టిలైజర్ షాప్, ఐకేపీ ఫెర్టిలైజర్ డీలర్లు, వ్యవసాయ అధికారులు, పీఏసీఎస్ కార్యదర్శులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ తో ఉపయోగాలను రైతులకు వివరించాలని పేర్కొన్నారు. యాప్ వినియోగంతో రైతులకు ఎరువుల వివరాలు, ఎక్కడ అందుబాటులో ఉందో అనే సమాచారం తెలుస్తుందని, వారికి కేటాయించిన ఎరువులు అందుబాటులో ఉంటాయనే వివరాలు తెలుపాలని సూచించారు. ఎక్కడి నుంచి అయినా రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం వివరాలతో లాగిన్ అయితే వారికి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. షాపుల యజమానులు యాప్ పై రైతులకు అవగాహన కల్పించేందుకు ఒకరిని నియమించాలని, వారు రైతులకు యాప్ లో బుకింగ్ పై సహాయం చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ పెరగడం వల్ల రైతులకు అధిక లాభం జరగడంతో పాటు దేశానికి కూడా ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తిగా ఉన్న రైతుల వివరాలు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఏవో, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆఫీస్ ఎదుట కాంగ్రెస్ నిరసన

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 18: బీజేపీ నిరంకుశ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ శుక్రవారం పొన్నాల వద్ద బీజేపీ ఆఫీస్ ఎదుట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఏఐసీసీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూముకుంట ఆంక్షారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆంక్షా రెడ్డి మాట్లాడుతూ... సుప్రీంకోర్టు తీర్పు చూసైనా అమిత్ షా,మోదీ ప్రభుత్వానికి బుద్ధి రావాలి, ఓటు చోరీ రాజకీయాలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు అని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పోరాడే పార్టీ కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. దేశాన్ని ముందుకు నడిపిస్తున్న నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు అని పేర్కొన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాల వల్ల రైతులు, పేదలు, నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రజల పక్షాన నిలబడి పోరాడుతోందని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. బీజేపీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ పోరాటంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు అండగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిలుస్తున్నాయని వారు ప్రకటించారు. ముట్టడి అనంతరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ కు పోలీసులు అరెస్ట్ చేసి తీసుకు వెళ్లగా , అక్కడ కూడా ధర్నా కార్యక్రమం కొనసాగింది .ఈ కార్యక్రమం లో రాష్ట్ర కిసాన్ సెల్ కో కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చి రెడ్డి , జిల్లా ఆర్టీఏ మెంబెర్ సూర్య వర్మ , సీనియర్ నేతలు మద్దెల సోమేశ్వర రెడ్డి , తడూరి శ్రీనివాస్ గౌడ్, దరిపల్లి చంద్రం,కౌన్సిలర్ రియాజుద్దీన్ , నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ , ఏఎంసీ చైర్మన్ మోహన్ , శ్రీధర్ , ఏఎంసీ మిరుదొడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి , కిసాన్ కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ , గజ్వేల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆజాద్, సిద్దిపేట పట్టణ మాజీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎల్లవ్వ , పద్మ, భవానీ, నాయకులు వంగరి నాగరాజు , నిజాముద్దీన్ , ఇబ్రహీం , గుండు రవితేజ, అహ్మద్ , కనకరాజు , శ్రీను , రవి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి
రూ.కోటి చెక్ పంపిణి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్,డిసెంబర్ 18 : రెండు నెలల క్రితం విధి నిర్వహణలో రౌడీ షీటర్ రియాజ్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. కోటిల చెక్కును పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అందజేశారు. పోలీస్ సాలరీ ప్యాకేజ్ వర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సురెన్స్ క్లెయిమ్ రూపంలో గల చెక్కు రూ.ఒక కోటిల చెక్కును గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రమోద్ కుమార్ సతీమణి ప్రణిత కు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ బీ ఐ అసిస్టెంటు జనరల్ మేనేజర్ సి.హెచ్.రవి కిరణ్ , రీజినల్ మేనేజర్ కె. మహేశ్వర్, చీఫ్ మేనేజర్ ఎన్.ఎన్.వి. సోమేశ్వర్ రావు, గంగాస్థాన్ బ్రాంచ్ మేనేజర్ ఎన్. శ్రీవిద్య, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి లు పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 18: సింగరేణి విశ్రాంత ఉద్యోగులు చేసిన ఆందోళనలకు స్పందించి సింగరేణి యాజమాన్యం సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు లాభాల వాటా దీపావళి బోనసులు ప్రకటించినందుకు గురువారం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. మంచిర్యాలలో గురువారం జరిగిన సమావేశంలో కారు మాట్లాడుతూ సింగరేణి విశ్రాంత ఉద్యోగులు చేసిన ఆందోళనకు స్పందించి ఈనెల 23న దీపావళి బోనస్ 18 లాభాల మాట పంచినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి విశ్రాంత దేవుల సంఘం అధ్యక్షులు గజేల్ది వెంకటయ్య గౌరవ అధ్యక్షులు రాళ్ల బంది రాజన్న నాయకులు పూదరి నర్సయ్య భీమ్సేన్ బిక్షపతి బోర్ల వ్యాధి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్

ప్రతిపక్ష ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 18 : పేదలకు ఉపాధి కల్పించాలనే మంచి ఉద్దేశంతో కాంగ్రెస్ నేతృత్వంలో యూపిఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి పని కల్పిస్తే దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ కుట్ర చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ మండిపడ్డారు. స్కీమ్ ను మార్చడమంటే పేదల పొట్టకొట్టడమేనని విమర్శించారు. పార్టీ పిలుపు మేరకు గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మ, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటున్నదని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నదని అన్నారు. పేదలు, రాష్ట్రాలను శిక్షించేలా కేంద్రం విధానం ఉన్నదని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గర్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)' (వీబీజీరామ్ జీ)గా మార్చే బిల్లును ఎమ్మెల్యే రోహిత్ రావు తప్పుబట్టారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడంలాంటి గొప్ప లక్ష్యాలతో నాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నదని మండిపడ్డారు. ఉపాధి హామీ పని దినాలను 200కి పెంచాలనీ, రోజుకూలిని రూ.307 నుంచి రూ.600 వరకు పెంచడంతో పాటు ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో డిసిసి అధ్యక్షులు రెడ్డి పల్లి ఆంజనేయులు గౌడ్, సీనియర్ నాయకులు సుప్రభాత్ రావు, శ్రీనివాస్ చౌదరి, సాన సత్యనారాయణ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫిజ్ మొల్సాబ్, రమేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముత్యం గౌడ్,తొడుపునూరి శివరామ కృష్ణ, లక్ష్మీనారాయణ గౌడ్,లింగం,సరాఫ్ యాదగిరి,ప్రభాకర్, నాగరాజు హరిత, అశ్విని, గోదల జ్యోతి, తిరుపతి రెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాధర్, శంకర్,బెండేల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట వార్డ్ సభ్యులకు ఎమ్మెల్యే సన్మానం

ప్రతిపక్షం, చేగుంట,డిసెంబర్ 18: చేగుంట మండల కేంద్రానికి చెందిన వార్డు సభ్యులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 14వ వార్డు సభ్యులు ఆకుల సుఖేందర్ అధిక మెజార్టీ సాధించడంతో ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులతో పాటు మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, దుంపల డిష్ రాజు, క్రాంతి, మహమ్మద్ అలీ, ఎర్ర యాదగిరి, శ్రీనివాస్, వంశీ, రాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రామకోటి రామరాజకు ఘన సన్మానం

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 18: భద్రాచల దేవస్థాన సీతారాముల కల్యానానికి గోటి తలంబ్రాలు అందించిన ఘనత మిడుదొడ్డి గ్రామ భక్తుల ఘనత అని రామకోటి సంస్థ కొనియాడి వారికీ తిరిగి భద్రాచల దేవస్థాన శ్రీరామరక్ష స్తోత్రం పుస్తకాలు, ముత్యాల తలంబ్రాలు గురువారం రామాలయంలో అందజేశారు శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా మాట్లాడుతు లోక కల్యాణర్థం శ్రీరామరక్ష స్తోత్రం పారాయణం చేయాలన్నారు. శాశ్వతమైన రామనామం ప్రతి ఒక్కరు లిఖించి తరించాలన్నారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజును దేవాలయ అధ్యక్షులు తోట కమలాకర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లింగాల అంజిత్ రెడ్డి, కానిగంటి మల్లయ్య, ఎక్కంటి యాదగిరి, యాదగౌడ్, రమేష్, రాజపున్నయ్య శర్మ, సీతారామాంజనేయ భజన మండలి భక్తులు పాల్గొన్నారు.

తుగ్లక్ పాలనలో రైతులకు ఇబ్బందులు

- రైతుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుంది
- సింగూర్ డ్యాం నుండి యాసంగి పంటకు నీళ్లు వదలాలి
- మాజీ మంత్రి హరీష్ రావు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 18: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక ప్రభుత్వాలని ఈ ప్రభుత్వాల వలన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని సకాలంలో ఎరువులు వద్దకు రైతు వద్దకు పెట్టుబడి లేక సరైన టైంలో నీటిని వదలకపోవడంతో రైతుల గోశా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పడుతుందని భారత రాష్ట్ర సమితి నాయకులు మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలలో సర్పంచిగా గెలిచిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ. సింగూర్ డ్యాం మరమత్తుల కారణంగా గణపురం ఆనకట్టకు సాగునీటి విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాసంగి పంట సాగు చేయాలా వద్దా అనే సందిగ్ధంలో మెదక్ జిల్లా రైతాంగం తీవ్ర అయోమయంలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు అగమ్యగోచర పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి గణపురం ఆనకట్టకు నీటిని విడుదల చేస్తారా లేదా అనే అంశంపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. పాపన్నపేట, హవేలీఘన్పూర్, కొల్చారం, మెదక్ రూరల్ మండలాల్లో వేలాది ఎకరాలు గణపురం ఆనకట్టపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. నాట్లు వేసే సమయం ఆసన్నమైనా అధికారులు స్పందించకపోవడంతో రైతులు మళ్లీ బోర్లు వేసుకుంటూ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే. పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి. మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి. మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి రాష్ట్ర నాయకులు కంటారెడ్డి తిరుపతి. మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్. ఏడుపాయల మాజీ చైర్మన్ బాల గౌడ్. పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎన్నికలలో కోడ్ ఉల్లంఘించిన కాంగ్రెస్

- రేవంత్ రెడ్డిపై పల్లె ప్రజల తిరుగుబాటు
- మాజీ మంత్రి హరీష్ రావు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్18: కాంగ్రెస్ అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ 40 శాతం సర్పంచ్ స్థానాలను గెలవడం.. రేవంత్ రెడ్డి పతనానికి, పల్లె ప్రజల తిరుగుబాటు నిదర్శనమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై గెలిచిన సర్పంచ్‌లను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించే మాట్లాడుతూ.ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ రేవంత్ రెడ్డి జిల్లాల్లో తిరిగినా తెలంగాణ జనం ఆయనను బండకేసి కొట్టారన్నారు. ఓట్ల కోసం పోలింగ్ బూత్‌ల దగ్గర కుర్చీలు వేసుకుని వంగి వంగి దండాలు పెట్టే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. యూరియా కష్టాలపై, గురుకులాల్లో పురుగుల అన్నంపై ఎందుకు కుర్చీ వేసుకుని నిలదీయలేదు హరీష్ రావు ప్రశ్నించారు. పెన్షన్లు, రుణమాఫీకి పైసలు లేవు కానీ.. మెస్సీ కోసం, అందాల పోటీల కోసం రేవంత్ రెడ్డి వందల కోట్లు ఖర్చు చేశాడు ఆయన ఆరోపించారు. రెండేళ్లలో మళ్ళీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. సచివాలయం పైన ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. ఏ రాష్ట్రంలోనైనా రూలింగ్ పార్టీ సర్పంచ్లు 80 నుండి 90 శాతం గెలుస్తారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే బీఆర్ఎస్ పార్టీ 40 శాతం సర్పంచ్లను గెలిచింది. అంటే ఇది దేనికి సంకేతం? ఒకవైపు రేవంత్ రెడ్డి కాలికి బలపం కట్టుకొని తిరిగిండు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ జిల్లా జిల్లాలు తిరిగిండు. అయినా కూడా జనం బండకేసి కొట్టారని హరీష్ రావు అన్నారు. ఊర్లో ఉండి కష్టపడి పని చేసుకోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలి. బాధ్యతను నిలబెట్టుకోవాలి.. ఆర్థిక సంఘం డబ్బులు నేరుగా 80 శాతం గ్రామ పంచాయతీలకు వస్తాయి.ఇందులో ప్రభుత్వ పార్టీ ప్రమేయం ఉండదు.సర్పంచుల అధికారాలపై శిక్షణా కార్యక్రమం పెట్టుకుందాం.ఓడిపోయిన వాళ్లు బాధ పడకుండా ధైర్యంగా ఉండాలని.పోయినసారి ఓడిపోయిన వారిని ఈసారి ప్రజలు మళ్లీ గెలిపించారు. వారికిమళ్లీ భవిష్యత్తు ఉంటుంది. ఓడిన వాళ్ళు నిరాశ చెందొద్దు. భవిష్యత్తు ఉంటుంది. గెలిచిన వాళ్ళు బాధ్యతతో పని చేయాలి మళ్లీ గెలవాలి అని గెలిచిన సర్పంచులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ షేర్ సుభాష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి భారత రాష్ట్ర సమితి నాయకులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి దేవేందర్ రెడ్డి , మాజీ మున్సిపాల్ చైర్మన్ మల్లికార్జున గౌడ్ , పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు. మాజీ ఏడుపాయల ఆలయ కమిటీ చైర్మన్ బాలా గౌడ్. భారత రాష్ట్ర సమితి నాయకులు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులతో పాటు నూతన సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

“

ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ నిర్ణయంపై పార్టీ పరంగా తాము స్పందించబోము. సొంత ఎమ్మెల్యేలు తమ పార్టీలో లేరని చెప్పుకునే దౌర్భాగ్య స్థితిలో బీఆర్ఎస్ ఉంది. స్పీకర్ నిర్ణయం నచ్చకపోతే న్యాయస్థానాలకు వెళ్లవచ్చు. ప్రతిపక్షాలకు ఇంకా అహం తగ్గలేదు. 2029 ఎన్నికల్లోనూ ఇదే ఫలితాలు రిపీట్ అవుతాయి.

- సీఎం రేవంత్ రెడ్డి

ప్రధాని మోడీకి ఓమన్ అత్యున్నత పురస్కారం

ప్రతిపక్షం నేసనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 18: భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంత ర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించు కున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవిం చడం విశేషం ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్ట మైన పౌర పురస్కారం. భారత్ ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు . కాగా, ప్రధాని మోదీ ఇప్పటివ రకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్‌కబీర్'తో ఆయనను గౌరవించింది. బుధవారం ఇథియోపియా తన అత్యున్నత పురస్కారమైన 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో ప్రధాని మోదీని సత్కరించింది

విశ్వ వీక్షణం



అరోరా బొరిలిస్, నార్వే

ఆకాశంలో ఆకుపచ్చ రంగును పెయింట్ వేసినట్లున్న ఈ ఫొటో ఎడిట్ చేసింది కాదు. ప్రకృతి సృష్టించింది. దీన్ని నార్తర్న్ లైట్ అంటారు. ఆకాశంలో ఆకుపచ్చ, పర్పుల్ రంగుల్లో కాంతులను చూడొచ్చిక్కడ. రంగులు తాండవం చేస్తున్నట్లుంటాయి. ఈ అద్భుతాన్ని చూడ్డానికి రెండు కళ్లు చాలవు. భూమి అయస్కాంత క్షేత్రం సూర్యుని కణాలతో ఢీ కొనడం వల్ల ఈ రంగుల కాంతి ఏర్పడుతుంది.

లైఫ్ ఒక్కసారైనా చూడాల్సిందే

కోటానుకోట్ల అద్భుతాల సమ్మేళనం ప్రకృతి. ప్రకృతి సహజంగా తనకు తాను సృష్టించుకున్న అద్భుతమైన ప్రదేశాలు కొన్ని ఉన్నాయి. ఇలాంటి ప్రదేశాలు కూడా ఉంటాయా అన్నట్టుగా, జీవితంలో ఒక్కసారైనా ఆ ప్రదేవానికి వెళ్లాలి అనే కుతూహలం కలిగించేఅంత అందమైన ప్రదేశాలు కొన్ని ఉన్నాయి. వాటిని చూడ్డానికి రెండు కళ్లు సరిపోవు. ఆ ప్రదేశాలు ఎక్కడున్నాయో, వాటి ప్రత్యేకత ఏంటో చూడండి. ప్రకృతి అంటేనే అందం. ప్రకృతి అంటే అద్భుతం. అందం, అద్భుతం కలబోసేలా ప్రకృతి సృష్టించిన ప్రదేశాలు కొన్ని ఉన్నాయి. సహజ పరిణామాల వల్ల ఈ ప్రదేశాల్లో మరెక్కడా లేని వింతలు ఉంటాయి. ఆ ప్రదేశాలేంటో, వింతలేంటో చూడండి. జీవితంలో వీటిని ఒక్కసారైనా చూడాల్సిందేనట.

బయో లుమినిసెంట్ బీచ్, మాల్దీవ్స్:

తెలుపు రంగు ఇసుక, నీలి రంగు నీళ్లతో మాల్దీవుల్లో బీచులు ఆకర్షణీయంగా ఉంటాయి. సముద్ర ప్రాంతాలు ఇష్టపడే వాళ్లకి మాల్దీవ్స్ మంచి యాత్రా ప్రదేశం. ఇదంతా పగటి పూట ముచ్చట. రాత్రయితే ఈ అందం రెట్టింపు అవుతుంది. మాల్దీవ్స్‌లోని రా అటోల్ ప్రాంతానికి వెళ్తే దీన్ని చక్కగా చూడొచ్చు. రాత్రి సముద్ర తీరాలు నీలిరంగు కరెంట్ పురుగులు వాలినట్లు మెరిసిపోతాయి. బయో లుమినిసెన్స్ అనే ప్రక్రియ వల్ల ఈ వింత జరుగుతుంది. ఒక్కసారైనా ఈ వింత చూడాల్సిందే.

రెయిన్ బో మౌంటెన్, పెరూ

ప్రకృతి పెయింట్ వేసిన అతిపెద్ద కాన్వాస్ అనుకోవచ్చు వీటిని. పెరూ దేశంలోని రెయిన్ బో పర్వతాలు రంగురంగులతో పెయింట్ వేసినట్లుంటాయి. వీటి మీదున్న మంచు పొర కరిగిన తర్వాత 2013 లో వీటిని కనుగొన్నారు. పర్పుల్, ఆకుపచ్చ, నీలం, పసుపు రంగు రాళ్లతో పెయింట్ వేసినట్లుంటుంది. మినరళ్ల పొరలు పేరుకుపోవడం వల్ల ఈ రంగులు ఏర్పడ్డాయట. ఈ వింత చూడ్డానికి పెరూలోని కూస్కో అనే ప్రదేశానికి వెళ్లాల్సిందే.

డైమండ్ బీచ్, ఐస్ ల్యాండ్:

ఈ డైమండ్ బీచ్ చూస్తే భూమి మీద ఉన్న విషయమే మర్చిపోతాం. ఏదో వింత లోకంలో ఉన్నట్లుంటుంది. నల్లటి ఇసుక మీద తెల్లగా అచ్చం వజ్రాల్లాగా మెరిసే మంచు ముక్కలుంటాయి. వీటికున్న ఆకారం కూడా ప్రత్యేకంగా వజ్రాలనే పోలి ఉంటుంది. ఈ వింతను చూడాలంటే ఐస్ ల్యాండ్ లోని సౌత్ కోస్ట్‌కు వెళ్లాల్సిందే.

వైటోమో గ్లో కేవ్స్, న్యూజిల్యాండ్:

న్యూజిల్యాండ్ లో ఉన్న వైటోమో గ్లో కేవ్స్ ఇంకా ప్రత్యేకమైనవి. ఈ గుహల్లో పై బాగంలో గ్లో వార్మ్ ఉంటాయి. అంటే మెరిసే పురుగులు. వీటివల్ల గుహలు మెరిసిపోతాయి. కింద నీళ్లు ఉండటం వల్ల ఆ మెరుపు మరింత రెట్టింపవుతుంది. ఒక బోట్ రైడ్ లో వీటిని వీక్షిస్తే నెరెల్లబెట్టి చూడాల్సిందే.

'శాంతి' బిల్లుకు ఉభయసభల ఆమోదం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 18: అణు ఇంధన రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించేందుకు ఉద్దేశించిన శాంతి బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) బిల్లును మూజువాణి ఓటుతో రాజ్యసభ గురువారం ఆమోదించింది. బుధవారమే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపించాలన్న ప్రతిపాదనతోసహా విపక్ష సభ్యులు ప్రతిపాదించిన పలు సవరణలను రాజ్యసభ తిరస్కరించింది. బిల్లుపై అణు ఇంధన శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభలో స్పందిస్తూ అణు ఇంధన రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు, ఇతర ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రతిపాదిత చట్టం దోహదపడుతుందని తెలిపారు. అంతకుముందు రాజ్యసభలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. అణు ఇంధనాన్ని ప్రైవేటీకరించడం వల్ల భద్రత, జవాబుదారీతనం లోపించే ప్రమాదం ఉందని విపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశ అణు ఇంధన వ్యవస్థను ధనాధిపత్యంగా మార్చడమే ఈ బిల్లు ఉద్దేశమని టీఎంసీ ఎంపీ సాగరికా ఘోష్ వ్యాఖ్యానించారు. తగిన రక్షణలు లేకుండా ప్రైవేట్ నియంత్రణకు ఈ రంగం తలుపులు తెరుస్తున్నారని ఆమె విమర్శించారు. డీఎంకే ఎంపీ విల్సన్ సైతం ఇవే అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ తీవ్రమైన భద్రతా అంశాలపై బిల్లులో ప్రస్తావన లేదని అన్నారు. అణు ఇంధన పరికరాలను సరఫరా చేసే సరఫరాదారుని జవాబుదారీతనాన్ని ఈ బిల్లు ద్వారా బలహీనపరిచారని ఆయన చెప్పారు. వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని అణు ఇంధన కేంద్రాలు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు. విదేశాల రెగ్యులేటరీ వ్యవస్థలను అనుసరించకుండా నేరుగా విదేశీ ప్రైవేట్ అణు ఇంధన నమూనాను ఈ బిల్లు ద్వారా దిగుమతి చేసుకుంటున్నట్లు ఆప్ ఎంపీ సందీప్ కుమార్ పాఠక్ వ్యాఖ్యానించారు. ప్రతిపాదిత చట్టంతో రాష్ట్రాలకు, స్థానిక వర్గాలకు ఒనగూరే ప్రయోజనాలు ఏమిటో స్పష్టతలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులకు ఉపాధి భరోసా, రాష్ట్రాలకు విద్యుత్ కేటాయింపులో ప్రాధాన్యత, సామాజిక అభివృద్ధి వంటి విషయాలేవీ బిల్లులో లేవని ఆయన చెప్పారు.

కర్ణాటకలో చైనా స్పై బర్డ్ కలకలం!

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, డిసెంబర్ 18: చైనా జీపీఎస్ ట్రాకర్ అమర్చిన సీగల్ అనే సముద్రపు పక్షి కర్ణాటక తీరంలో కనిపించడం కలకలానికి దారితీసింది. ఉత్తర కన్నడ జిల్లాలోని రవీంద్రనాథ్ ఠాగూర్ బీచ్ వద్ద కోస్టల్ మెరీన్ పోలీస్ సెల్ బృందం ఈ పక్షిని గుర్తించింది. పక్షి గాయపడటంతో సిబ్బంది దాన్ని అటవీ శాఖకు అప్పగించారు. సీగల్ పక్షి ఒంటికి ఓ జీపీఎస్ ట్రాకర్ చుట్టి ఉందని అధికారులు తెలిపారు. ఈ జీపీఎస్‌లో ఒక ఎలక్ట్రానిక్ యూనిట్ , సోలార్ ప్యానల్ ఉన్నట్టు చెప్పారు. ఈ పక్షిని చూసిన వారు ట్రాకర్‌కున్న ఐడీ ద్వారా తమను సంప్రదించాలన్న సూచన కూడా ఉందని చెప్పారు. చైనా అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు సంబంధించిన ఈమెయిల్ ఐడీ కనిపించిందని అధికారులు చెప్పారు. ఈ విషయంపై క్లారిటీ కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ పరిణామాన్ని అన్ని కోణాల్లో విశ్లేషిస్తున్నామని ఉత్తర కన్నడ ఎస్పీ ఎమ్ఎన్ దీపన్ తెలిపారు. పక్షుల వలసలను అధ్యయనం చేసే ప్రాజెక్టులో ఈ పక్షి భాగమా అనే కోణాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు తెలిపారు. అనేక నావికా స్థావరాలకు నెలవైన తీరంలో చైనా జీపీఎస్ ట్రాకర్ ఉన్న పక్షి కనిపించడంతో ఈ పరిణామానికి ప్రాధాన్యం ఏర్పడింది. తీర ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే ఈ పక్షులు సంతానోత్పత్తి సమయంలో ఇతర ప్రాంతాలకు వలసపోతుంటాయి. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఇవి ఉత్తారన ఉన్న చల్లని ప్రాంతాల నుంచి భూమధ్య రేఖకు సమీపంలో వేడి ఎక్కువగా ఉండే ప్రాంతాలకు వలస వస్తుంటాయి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకుని అలవాటు పడిపోయే శక్తి వీటికుందని పరిశోధకులు చెబుతున్నారు.

సిడ్నీలో ఉగ్రదాడికి ప్లాన్

- ఏడుగురు అనుమానితుల అరెస్టు

సిడ్నీ, డిసెంబర్ 18: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఉన్న బాండీ బీచ్‌లో షూటౌట్ జరిగిన విషయం తెలిసిందే. ఆ ఘటనపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఇవాళ పోలీసులు స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. సిడ్నీ శివారు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో.. ఓ కారును సీజ్ చేశారు. దాంట్లో ప్రయాణిస్తున్న ఏడు మందిని అదుపులోకి తీసుకున్నారు. న్యూ సౌత్ వేల్స్ పోలీసులు దీనిపై ప్రకటన జారీ చేశారు. ఓ విధ్వంసకర దాడికి ప్లాన్ జరిగినట్లు తెలుస్తోందన్నారు. అయితే బాండీ బీచ్ టెర్రర్ దాడితో లింకున్నవారిని గుర్తించలేదని పోలీసులు చెప్పారు. ఏడుగుర్ని బంధించిన పోలీసులు వారిని నేలపై కూర్చోబెట్టారు. అనుమానితులను గన్‌పాయింట్‌లో అరెస్టు చేశారు. చేతులకు బేడీలు వేశారు. విక్టోరియా ప్లేట్‌తో వెళ్తున్న తెలుపు రంగు కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక మీడియా పేర్కొన్నది. బాండీ బీచ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో సుమారు 15 మంది ప్రాణాలు కోల్పోయారు. సాజిద్ అక్రమ్, అతనికి కుమారుడు నవీద్ ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

అసలు 'గిల్'కు ఏమైంది..?

దక్షిణాఫ్రికాతో జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దూరమయ్యాడు. లక్నోలో బుధవారం జరగాల్సిన మ్యాచ్ భారీ పొగమంచు కారణంగా రద్దయిన విషయం తెలిసిందే. శుక్రవారం జరగాల్సిన మ్యాచ్ నుంచి సైతం గిల్ తప్పుకున్నాడు. సిరీస్ మధ్యలోనే టెస్ట్‌వన్డే కెప్టెన్ తప్పుకోవడం అందరినీ షాక్‌కు గురి చేసింది. గిల్ ప్రాక్టీస్ సమయంలో గాయపడినట్లుగా సమాచారం. నిజంగా గిల్ గాయపడ్డాడా? లేకపోతే జట్టు నుంచి తప్పించారా? అంటూ సోషల్ మీడియా వేదికగా పలువురు అభిమానులు సందేహాలు లేవెత్తుతున్నారు. కోల్‌కతా టెస్ట్ సమయంలో శుభ్‌మన్ గిల్ గాయపడ్డాడు. మెడ గాయం కారణంగా గిల్‌ను కోల్‌కతాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లోకు సైతం గిల్ దూరమయ్యాడు. టీ20 సిరీస్‌కు ముందు గిల్ ఫిట్‌గా ఉన్నట్లుగా సర్టిఫికెట్ ఇవ్వడంతో బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడంతో టీ20 సిరీస్‌కు అందుబాటులోకి వచ్చాడు. తాజాగా గాయం కారణంగా టీ20 సిరీస్ కారణంగా మళ్లీ జట్టు నుంచి తప్పుకున్నాడన్న వార్త అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నది. వాస్తవానికి గిల్, పేలవమైన ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20ల్లో బ్యాట్ తో ఆకట్టుకోలేకపోయాడు. భారత జట్టుకు శుభారంభం అందించడంలో విఫలమయ్యాడు. గిల్ వన్డేలు, టెస్టుల్లో రాణించగా.. టీ20 మ్యాచుల్లో మాత్రం పరుగులు చేయలేక ఇబ్బందిపడ్డాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని మూడు మ్యాచుల్లో కలిసి కేవలం 32 పరుగులు మాత్రమే చేయగలిగాడు. తొలి మ్యాచ్‌లో 4, రెండో మ్యాచ్‌లో డకౌట్, మూడో మ్యాచ్‌లో కేవలం 28 పరుగులు చేశాడు. నాలుగో మ్యాచ్ లక్నోలోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ స్టేడియంలో జరగాల్సిన మ్యాచ్ టాస్ పడకుండానే పొగమంచు కారణంగా రద్దయ్యింది. ప్రస్తుతం భారత్ ఈ సిరీస్‌లో 21 ఆధిక్యంలో ఉంది. ఫైనల్ మ్యాచ్ నేడు అహ్మదాబాద్‌లో జరగనున్నది.

స్మాట్ ఛాంపియన్ ఝార్ఖండ్

దేశవాళీ టీ20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ2025 ఛాంపియన్‌గా జార్ఖండ్ జట్టు నిలిచింది. హరియాణాతో జరిగిన ఫైనల్‌లో 69 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అంతేకాక జార్ఖండ్‌కు ఈ టోర్నీ తొలి టైటిల్ ఇదే. టాస్ ఓడి.. తొలుత బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 262 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్, ఓపెనర్ ఇషాన్ కిషన్ (49 బంతుల్లో 101) సూపర్ సెంచరీ చేయగా.. వన్‌డౌన్ బ్యాటర్ కుమార్ కుశాగ్రా (38 బంతుల్లో 81) మెరుపులు మెరిపించాడు. అనంతరం భారీ టార్గెట్ తో బ్యాటింగ్‌కు దిగిన హరియాణా 18.3 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. యశ్వర్ధన్ దలాల్ (53), సమంత్ జాఖర్ (38), నిశాంత్ సింధు (31) దూకుడుగా ఆడి.. హరియాణాను గెలిపించేందుకు విఫలయత్నం చేశారు. అయితే.. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో హరియాణాకు ఓటమి తప్పలేదు. జార్ఖండ్ బౌలర్లలో సుశాంత్ మిశ్రా 3, బాలకృష్ణ 3, వికాష్ సింగ్, అనుకుల్ రాయ్ రెండేసి వికెట్లు తీశారు. పుణేలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన హరియాణా.. జార్ఖండ్‌ను తొలుత బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఈ క్రమంలో ఓపెనర్లలో కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఇషాంత్ భరద్వాజ్‌ను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు బాదాడు. సుమిత్ కుమార్ వేసిన వరుస ఓవర్లలో కుశాగ్రా నాలుగు ఫోర్లు, ఓ సిక్స్ కొట్టాడు. ఈ క్రమంలోనే కిషన్ 24 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. అంశుల్ కాంబోజ్ వేసిన 14వ ఓవర్‌లో తొలి బంతికి సిక్స్ కొట్టి 90ల్లోకి వచ్చేశాడు. అదే ఓవర్‌లో వరుసగా ఫోర్, సిక్స్ రాబట్టి సెంచరీ (45 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. దీంతో జార్ఖండ్ 14 ఓవర్లకు 180/1తో నిలిచింది. చివర్లో అనుకుల్ రాయ్ (40/ 20 బంతుల్లో), రాబిన్ మింజ్ (31/ 14 బంతుల్లో) దూకుడుగా ఆడారు. ఈ జోడీ 29 బంతుల్లో 75 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించింది. మొత్తంగా హరియాణా ముందు 263 పరుగుల భారీ టార్గెట్‌ను ఉంచగా.. ఆ జట్టు కేవలం 193 పరుగులు మాత్రమే చేసింది. కాగా గతంలో దేశీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ 201011 టైటిల్ గెలుచుకున్న జార్ఖండ్.. తాజాగా ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈ టీ20 ట్రోఫీని కైవసం చేసుకుంది.

న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ కొత్త చరిత్ర

- 95 యేండ్ల రికార్డు బద్దలు

న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్లు టామ్ లాథమ్, డెవాన్ కాన్వే 95 యేండ్ల రికార్డును బ్రేక్ చేశారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో తొలి వికెట్‌కు అత్యుత్తమ భాగస్వామ్యం నెలకొల్పిన ఓపెనింగ్ జోడీగా నిలిచారు. వెస్టిండీస్‌తో గురువారం ప్రారంభమైన మూడో టెస్టు సందర్భంగా ఈ ఘనత సాధించారు. న్యూజిలాండ్ జట్టు స్వదేశంలో విండీస్ తో మూడు టెస్టుల సిరీస్ ఆడుతోంది. అసాధారణ పోరాటంతో వెస్టిండీస్ తొలి టెస్టు డ్రా చేసుకోగా.. రెండో టెస్టులో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో గెలిచింది. ఇరుజట్ల మధ్య గురువారం ఓవల్ వేదికగా మూడో టెస్టు ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆతిథ్య కివీస్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో ఓపెనర్లు టామ్ లాథమ్, డెవాన్ కాన్వే సెంచరీలతో చెలరేగారు. కెప్టెన్ లాథమ్ 246 బంతుల్లో 137 పరుగులు చేశాడు. ఇందులో 15 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. లాథమ్ 86.4 ఓవర్లో 323 పరుగుల వద్ద రోచ్ బౌలింగ్‌లో రోస్టన్ చేజ్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. మరోవైపు.. తొలిరోజు ఆట ముగిసే సరికి కాన్వే 279 బంతుల్లో 178 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కాన్వే జోరు చూస్తే.. రెండో రోజు అతడు డబుల్ సెంచరీ చేసే అవకాశం ఉంది. అతడికి తోడుగా నైట్ వాచ్‌మన్ జేకబ్ డఫీ 9 పరుగులతో క్రీజులో ఉన్నాడు. మొత్తంగా తొలి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 90 ఓవర్లలో వికెట్ నష్టానికి 334 పరుగులు సాధించింది. తొలి వికెట్‌కు లాథమ్, కాన్వే కలిసి 520 బంతుల్లో ఏకంగా 323 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. ప్రపంచ ఛాంపియన్ షిప్ చరిత్రలో ఇదే అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం కావడం విశేషం. 2019లో సౌతాఫ్రికాతో టెస్టులో టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్ తొలి వికెట్‌కు 317 పరుగులు జోడించారు. తాజాగా లాథమ్‌కాన్వే ఆ రికార్డును సవరించారు. అంతేకాదు.. సొంతగడ్డపై టెస్టుల్లో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం సాధించిన జోడీగానూ లాథమ్, కాన్వే చరిత్రకెక్కారు.

సాత్విక్ జోడీ శుభారంభం

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి శుభారంభం చేశారు. గ్రూప్‌డీలో భాగంగా జరిగిన పురుషుల డబుల్స్ తొలి మ్యాచ్‌లో భారత జోడీ.. 1221, 2220, 2114తో ప్రపంచ ఐదో ర్యాంకర్లు చాంగ్ వాంగ్‌వీ కెంగ్ లియాంగ్ (చైనా)ను ఓడించింది. సాత్విక్ జోడీ తొలి గేమ్‌ను ఓడినా తర్వాత పుంజుకుని వరుసగా రెండు గేమ్స్‌ను గెలుచుకుని ప్రత్యర్థిని చిత్తుచేసింది.

'డెకాయిట్' టీజర్ విడుదల

వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న అడివి శేష్ తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'డెకాయిట్' తో అలరించబోతున్నారు. షానియల్ డియో దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఈ లవ్, యాక్షన్ డ్రామాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. శేష్ పుట్టినరోజు సందర్భంగా నిన్న ఒక ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేసిన తర్వాత, మేకర్స్ గురువారం టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ లవ్ స్టోరీ, రూత్ లెస్ జర్నీ, ఒక పెద్ద లక్ష్యంతో నడిచే హీరోని ప్రజెంట్ చేస్తోంది. ప్రేమ, దోపిడీ ఈ రెండు ప్రధాన అంశాల చుట్టూ కథనం సాగుతుంది. మొదటిసారిగా మాస్‌ఓరియెంటెడ్ పాత్రలో కనిపించిన అడివి శేష్ అదరగొట్టారు. క్యారెక్టర్ మల్టీ షేడ్స్‌తో ఆకట్టుకుంది. శేష్ రగ్గడ్ అవతార్‌లో కనిపించిన తీరు అదిరిపోయింది. మదనపల్లె యాసలో మాట్లాడిన తీరు ఆకట్టుకుంది. మృణాల్ ఠాకూర్ పాత్ర శేష్ పాత్రల తో పాటు ప్రయాణిస్తుంది, అమాయకత్వం, ఎమోషన్ మధ్య ఊగిసలాడుతూ కథనానికి డెప్త్ ని జోడిస్తుంది. టీజర్ అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, సునీల్‌లను కీలక పాత్రలలో పరిచయం చేస్తుంది. అనుభవజ్ఞులైన నటుల అద్భుతమైన తారాగణం శక్తివంతమైన ఆన్‌స్క్రీన్ ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధంగా వుంది. సినిమాటోగ్రాఫర్ దనుష్ భాస్కర్ విజువల్స్ అద్భుతంగా వున్నాయి. యాక్షన్ సన్నివేశాలు చాలా గ్రాండ్‌గా ప్రజెంట్ చేశారు. జ్ఞానీ ఇంటెన్స్ స్కోర్ టీజర్‌లో ఉత్సాహాన్ని నింపుతుంది. బీజీఎంలో ఐకానిక్ సాంగ్ 'కన్నె పిట్టరో కన్ను కొట్టరో' రీమిక్స్ చేయడం ఎక్స్‌పీరియన్స్‌ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకువెళుతుంది. నిర్మాణ విలువలు అద్భుతంగా ఉనాయి. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.ఈ అద్భుతమైన టీజర్ సినిమాపై అంచనాలని భారీగా పెంచింది. ఈ చిత్రం మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

'బుకీ' నుంచి బ్రేకప్ యాంథమ్ రిలీజ్

అజయ్ దిషన్, ధనుష హీరో హీరోయిన్స్ గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూత్ ఫుల్ ఎంటర్టైనర్ 'బుకీ'. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామంజేయులు జవ్వాజీ నిర్మిస్తున్నారు. వివిఎఫ్సి ప్రజెంట్ చేస్తున్నారు. తాజాగా మేకర్స్ 'బుకీ' బ్రేకప్ యాంథమ్ తొక్కలో మనసు పగిలేనే సాంగ్‌ని రిలీజ్ చేశారు. విజయ్ ఆంటోని ఈ సాంగ్ ని అద్భుతమైన వైబ్ తో కంపోజ్ చేశారు. విజయ్ ఆంటోని, ఖరెస్మా రవిచంద్రన్ ఎనర్జిటిక్ వోకల్స్ ఆకట్టుకున్నాయి. భాష్యశ్రీ సాహిత్యం క్యాచిగా వుంది. ఈ సాంగ్ ఇన్స్టంట్ గా హిట్ అయ్యింది. ఈ చిత్రంలో పాండియరాజన్, సునీల్, లక్ష్మి మంచు, ఇందుమతి, వివేక్ ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు.

'బ్యాడ్ గాళ్స్' టీజర్ విడుదల

ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, మొయిన్, రోహన్ సూర్య ముఖ్య తారాగణం తో '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమా తో మంచి విజయాన్ని అందుకున్న డైరెక్టర్ ఫణి ప్రదీప్ ధూళిపూడి దర్శకత్వంలో వస్తున్న మరో ఎంటర్టైనర్ చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఈ చిత్రం క్రిస్మస్ పండుగ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది.అయితే ఈ రోజు రామ్ చరణ్ పెద్ది చిత్ర దర్శకుడు బుచ్చి బాబు సానా ఈ చిత్రం యొక్క టీజర్ ను విడుదల చేసారు. ఈ సందర్భంగా... పెద్ది చిత్ర దర్శకుడు బుచ్చి బాబు సానా మాట్లాడుతూ 'ఈ బ్యాడ్ గాళ్స్ చిత్ర కథ నాకు మున్నా గారు చెప్పారు, కథ చాలా బాగుంది. క్లైమాక్స్ చాలా ఎమోషనల్ గా ఉంటుంది. దర్శకుడు సుకుమార్ గారి దగ్గర నేను అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేస్తున్నప్పుడు మున్నా సుకుమార్ గారి దగ్గరకు వచ్చేవాడు, సుకుమార్ గారికి తాను రాసుకున్న కథలు చెపి ఆయనతో ఓకే చేయించుకునేవారు. ఉప్పెన చిత్రం లో 'నీ కన్ను నీలి సముద్రం' పాట ఎంత హిట్ అయిందో దానికి డబుల్ హిట్ అయింది 'నీలి నీలి ఆకాశం' పాట. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ ఈ చిత్రానికి కూడా అద్భుతమైన పాటలు ఇచ్చారు. 'మనం 'సినిమా పాటల కి నేను పెద్ద ఫ్యాన్ ని. ఈ చిత్రంలో రేణు దేశాయ్ గారు ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నారు. రేణు దేశాయ్ గారు ఈ సినిమా ఒప్పుకున్నారు అంటే సినిమా ఎంత బాగుంటుందో తెలుస్తుంది. డిసెంబర్ 25న విడుదల అవుతుంది తప్పక చూడండి" అని తెలిపారు.

'అఖండ 2' సక్సెస్ క్రెడిట్ ఆ ఇద్దరిదే

మ్యూజిక్ డైరెక్టర్ తమన్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను అఖండ భారత్ బ్లాక్ బస్టర్ 'అఖండ 2: ది తాండవం'. ఈ ప్రతిష్టాత్మకమైన చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఎం తేజస్విని నందమూరి సమర్పించారు. డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తో హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. "మనం స్క్రిప్ట్ అనుకున్నప్పుడే కొన్ని హై మూమెంట్స్ అనుకుంటాం. బోయపాటి గారు ఆషామాసి డైరెక్టర్ కాదు. కమర్షియల్ సినిమా నమ్మించేలా తీయడం నిలబెట్టడం చాలా గొప్ప విషయం. అందులోనూ సనాతన ధర్మం కంటెంట్ గా తీసుకుని దాన్ని కమర్షియల్ గా చెప్పడం, అందులోనూ బాలయ్య గారి లాంటి సూపర్ మాస్ ఎనర్జిటిక్ స్టార్ తో చేయడం మామూలు విషయం కాదు. అఖండపాత్ర అందరికీ సర్ప్రైజ్. నిజానికి అఖండలో అంత ఉంటుందని ఎవరూ అనుకోలేదు. సెకండ్ పార్ట్ కి వచ్చే సరికి మరింత భారీ అంచనాలతో ప్రేక్షకులు వచ్చారు. సనాతన ధర్మాన్ని అద్భుతంగా చెప్పి కమర్షియల్ విజయాన్ని సాధించడం.. బాలయ్యకి, బోయపాటి కి ఆ క్రెడిట్ దక్కుతుంది. నిజానికి అఖండ నాకు చాలా ఛాలెంజింగ్ గా అనిపించింది. బోయపాటి గారికి నాకు రెండు నెలలు సమయం కావాలని అడిగాను ఒక్క రీల్ చేసి చూపించాను. ఆయనకు చాలా నచ్చింది. అప్పుడు నాకున్న బడ్జెట్ ని మార్చి, నాకు మరింత సమయాన్ని ఇచ్చి ఎంతగానో సపోర్ట్ చేయించి చేసి మ్యూజిక్ చేయించారు. అఖండకి అయిన నాకు వెన్నుముకలాగా నిలిచారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టాలనే తాపత్రయంతో వర్క్ చేశాను. అఖండ మ్యూజిక్ అందరూ సర్ప్రైజింగ్ గా విన్నారు. ఇప్పుడు అఖండ 2 లో ఇంకా ఎంత కొత్తగా చేయొచ్చు అని ఆలోచించా. అందులోనూ తాండవం అని పేరు పెట్టారు. ఆడియన్స్ ని ఎలా ట్రాన్స్‌లోకి తీసుకువెళ్లాలి అని ఆలోచన చేస్తూ చాలా హార్డ్ వర్క్ చేసి ఈ సినిమా చేశాం. ఈ సినిమాకి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేయడానికి 73 రోజులు పట్టింది. అందులో ఒక 20 రోజులు శివుని మంత్రాలు ఎంత కొత్తగా చేయాలి అనే దానికి ఒక 20 రోజులు ఎక్సర్సైజ్ చేశాం. తర్వాత 40 రోజులు ఇన్స్ట్రుమెంట్, రికార్డింగ్ వర్క్ చేసాం. జాజికాయ సాంగ్ తప్పితే సినిమాలోని ఎనిమిది పాటలు కూడా ఆ 70 రోజుల్లో చేసినవే. అఖండ మ్యూజిక్ బ్రెయిన్ కి చాలా మంచి ఎక్సర్సైజ్. శివుడికి సినిమా చేస్తున్నప్పుడు మన మెదడు చాలా శుద్ధి అవుతుంది. జనరల్ గా బోయపాటి గారి సినిమాలో ఇంటర్వెల్ క్లైమాక్స్ చేయడం చాలా కష్టం. మొదటి రీల్ నుంచి నాకు చాలెంజ్ మొదలైంది. అష్టసిద్ధి కుంభమేళా ఇంటర్వెల్, ఆది గారి ఎపిసోడ్, హనుమంతుడు ఎపిసోడ్ లాస్ట్ లో అవెంజర్స్ లాంటి క్లైమాక్స్ ఇవన్నీ చాలా హార్డ్ వర్క్ తో కూడుకున్నవి. బోయపాటి గారి సినిమాలన్నీ ఒక రీల్ కు మించి మరొకటి ఉంటుంది. ఆయన ఎనర్జీని పట్టుకోవడం చాలా కష్టం. మా టీం చాలా సపోర్ట్ చేశారు. 14 రీల్స్ నిర్మాతలు బోయపాటి గారు అందరూ చాలా సపోర్ట్ చేశారు. ఇక బాలయ్య గారి సపోర్ట్ గురించి అడగక్కర్లేదు ఆయనను చూస్తే వేరే లెవెల్ ఎనర్జీ ఉంటుంది. ఆయన బ్లెస్సింగ్స్ మాకు ఎప్పుడు ఉంటాయి. ఒక్కొక్క రీల్ చేసి ఆయన్ని స్టూడియోకి తీసుకొచ్చి వినిపించడం చాలా అద్భుతంగా జరిగిన ప్రయాణం."అన్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200